VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారం

RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 155 విశాఖపట్నం, 30 మార్చి 2025 ఆదివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00


## విశ్వావసు పథం.. నవ చైత్రరథం..

ఈ ఉగాది విశ్వంభరాన్ని ధరియించి విశ్వావసుగా వచ్చింది.
విశ్వైక ప్రేమతో తరియించి విశ్వమంతా నిలిచింది.
పాతదనంలో కొత్తదనం ఇంధనంలా మెరిసి
అందమైన మామిడి రెమ్మల మాటున బంధంలా పూత మురిసి.
చెరుకు గడ హరివిల్లుగా మారి ద్వార తోరణమయ్యింది.
పంచాంగ శ్రవణముల జాడ సాంప్రదాయాల తీరమయింది.
వేపపూల పరిమళాలతో పులకరించింది నవ వసంతం
ఋతువుల క్రతువులతో పలుకరించింది
విశ్వావసు వసంత ఆగమన వేళ మిత్రులు, శ్రేయోభిలాషులు,
పాఠకులు, ప్రకటనకర్తలకు శుభాకాంక్షలు. - విశాఖ సమాచారమ్ యాజమాన్యం



# తెలుగు వారు ఉన్నంత వరకు టీడీపీ ఉంటుంది



- పార్టీ ఆవిర్భావ వేడుకల్లో అధినేత చంద్రబాబు

**అమరావతి, విశాఖ సమాచారమ్:** ఒక మహనీయుడి విజన్ తెలుగు దేశం పార్టీ అని ఏపీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. ఆదర్శం కోసం పుట్టిన పార్టీ తమదని పేర్కొన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ 43వ ఆవిర్భావ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు. "పార్టీ పెట్టి 9 నెలల్లో అధికారం దక్కించుకున్న ఏకైక పార్టీ తెదేపా. పేదల సంక్షేమానికి నాంది పలికిన మహానుభావుడు ఎన్టీఆర్. పార్టీకి మనమంతా వారసులం మాత్రమే.. పెత్తందారులం కాదు. నేను కూడా పార్టీకి అధ్యక్షుణ్ని.. టీమ్ లీడర్‌ను మాత్రమే. ప్రతి కార్యకర్తకు న్యాయం చేయాలి. తెలుగువారు ఉన్నంత వరకు పార్టీ ఉంటుంది.
పార్టీని లేకుండా చేయాలని చాలా మంది ప్రయత్నించారు. అలాంటి వారు కాలగర్భంలో కలిసిపోయారు. టీడీపీని ఏమీ చేయలేక పోయారు. ముహూర్త బలం చాలా గొప్పది. పార్టీ సంకల్ప బలం కూడా చాల గొప్పది. చరిత్రలో టీడీపీ నాటి స్వర్ణ యుగం అని చెప్పుకొనే రోజులు శాశ్వతంగా వస్తాయి. 43 ఏళ్ల ఎన్నో సంక్షోభాలు ...(మిగతా 2లో)

### పార్టీ మాకు కన్నతల్లి వంటిది
### రామ్మోహన్‌నాయుడు



**ఢిల్లీ:** ఆవిర్భావ వేడుకలు ఢిల్లీలో ఘనంగా జరిగాయి. ఎంపీ లావు శ్రీకృష్ణ దేవ రాయలు నివాసంలో జరిగిన ఈ వేడుకలకు తెదేపా ఎంపీలు హాజరయ్యారు. ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.." ఎలాంటి కష్టాలు వచ్చినా టీడీపీ ఎదుర్కొని ...(మిగతా 2లో)

# జీవీఎంసీ ఆర్థిక బడ్జెట్‌కు ఆమోదం





**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్) :** విశాఖ కార్పొరేషన్: మహా విశాఖ నగరపాల సంస్థ 2025-2026 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ రూ.4601.40 కోట్లను పాలకవర్గం ఆమోదించింది. శనివారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయరు గొలగని హరి వెంకట్ కుమారి అధ్యక్షతన బడ్జెట్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ఏడాది బడ్జెట్ ఆలస్యం కావడంపై టీడీపీ ఫ్లోర్ లీడర్ శ్రీనివాసరావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బడ్జెట్ వాస్తవానికి దూరంగా ఉందని సీపీఎం ఫ్లోర్ లీడర్ గంగారావు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇన్‌ఛార్జి కమిషనర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్, ఎంపీ గొల్ల బాబురావు సమావేశానికి హాజరయ్యారు. కాగా ...(మిగతా 2లో)



జీవీఎంసీ బడ్జెట్ సమావేశంలో ఖాళీగా కనిపించిన వైసీపీ కుర్చీలు

## భారీ ఎన్‌కౌంటర్...

- 16 మంది మావోయిస్టుల మృతి



**సుక్మా:** ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. దండకారణ్యంలో శనివారం ఉదయం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో 16 మంది మావోయిస్టులు మృతి చెందారు. స్థానిక గోగుండా కొండపై మావోయిస్టుల కదలికలు ఉన్నాయన్న సమాచారంతో పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. ఈక్రమంలో మావోయిస్టులు కాల్పులకు దిగారు. ఎదురుకాల్పులు జరిపిన పోలీసులు 16 మందిని హతమార్చారు. ఇద్దరు భద్రతా సిబ్బందికి గాయాలయ్యాయి. కెర్లపాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కాల్పులు చోటుచేసుకున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. డిస్ట్రిక్ట్ రిజర్వ్‌గార్డ్ (డి ఆర్ జి), సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్పిఎఫ్) ...(మిగతా 2లో)

## ఘనంగా బ్రహ్మ కుమారీస్ ఉగాది సంబరాలు



- వార్త 2 లో..

## నేడు చిల్డ్రన్ ఎరీనాలో ఉగాది వేడుకలు

### కలెక్టర్ హరేంధిర ప్రసాద్



**విశాఖపట్టణం, విశాఖ సమాచారమ్ :** స్థానిక ఉడా చిల్డ్రన్ ఎరీనాలో ఆదివారం ఉదయం నుంచి విశ్వావసు నామ ఉగాది వేడుకలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ...(మిగతా 2లో)



## స్వచ్ఛందంగా దేశాన్ని వీడండి

**అమెరికాలోని విదేశీ విద్యార్థులకు మెయిల్స్**

**వాషింగ్టన్:** క్యాంపస్ ఆందోళనల్లో క్రియాశీలంగా వ్యవహరించిన అమెరికాలోని విదేశీ విద్యార్థులకు అక్కడి విదేశాంగ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. స్వచ్ఛందంగా దేశం విడిచి వెళ్లిపోవాలంటూ ఈమెయిల్స్ పంపినట్లు సమాచారం. కేవలం ఆందోళనల్లో పాల్గొన్నవారికే కాకుండా అక్కడి దృశ్యాలను, జాతి వ్యతిరేక సందేశాలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసిన విద్యార్థులకు కూడా హెచ్చరిక సందేశాలు పంపినట్లు తెలుస్తోంది. ఈ జాబితాలో కొందరు భారతీయ విద్యార్థులు సైతం ఉండే అవకాశముంది. అమెరికా తీసుకున్న ఈ నిర్ణయంతో అక్కడి విద్యార్థులు ఆన్‌లైన్‌లో ...(మిగతా 2లో)

## వేడెక్కిన ఏపీ

**150కి పైగా మండలాల్లో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు**



**విజయవాడ, విశాఖ సమాచారమ్:** వడగాలుల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు ఠారెత్తాయి. కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో సగటున 40 డిగ్రీలకు చేరాయి. సాధారణం కంటే 4 డిగ్రీల వరకూ ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నట్టు ఐఎండీ వెల్లడిరచింది. రాష్ట్రవ్యాప్తంగా 150కి పైగా మండలాల్లో 40 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.

- ప్రకాశం జిల్లా కొమరోలు, నంద్యాల, కమలాపురంలో అత్యధికంగా 42.5 డిగ్రీల మేర ఉష్ణోగ్రత
- ఎస్ కోట, అనకాపల్లి, అన్నమయ్య జిల్లా రుద్రవరంలో 42 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు
- కర్నూలు జిల్లా కొసిగి, శ్రీకాకుళం జిల్లా మిళియాపుట్టు, సత్యసాయి జిల్లా తాడిమర్రి, సబ్బవరం, వీరఘట్టంలో 41 డిగ్రీలు
- అనంతపురం జిల్లా గుంతకల్లు, తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం, తిరుపతి, నెల్లూరులో 40 డిగ్రీలు
- చిత్తూరు, కృష్ణా జిల్లా మచిలీపట్నం, పల్నాడు జిల్లా నరసరావుపేట, ఏలూరు తదితర ప్రాంతాల్లో 40 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు




# ఘనంగా బ్రహ్మ కుమారీస్ ఉగాది సంబరాలు

**సీతమ్మ ధార, విశాఖ సమాచారమ్:** షడ్రుచులతో జీవిత పరమార్ధం చెప్పే పండుగ ఉగాది అని ఏపీఈపీడీసీఎల్ మాజీ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం .సింహాద్రి రాజు ఆకాంక్షించారు. ప్రజాపిత బ్రహ్మాకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం విశాఖపట్నంలోని స్థానిక సేవా కేంద్రాల ఆధ్వర్యంలో శనివారం సీతమ్మధార ఏపీఎస్ఇబి పార్కు కమ్యూనిటీ హాల్లో ఉగాది సంబరాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షడ్రుచులతో జీవిత పరమార్ధం చెప్పే పండుగ ఉగాది అన్నారు. విశాఖ సమాచారం అధినేత వీరభద్ర రావు మాట్లాడుతూ చైత్ర మాసంతో తెలుగు నెల మొదలవుతుందని తెలుగువారి మొదటిపండుగ ఉగాది అన్నారు.

జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ క్రమం తప్పకుండా బ్రహ్మాకుమారీలు అన్ని పండుగలు జర్నలిస్టులతో కలిసి చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. కన్సర్న్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ పీకె జోస్ మాట్లాడుతూ ఆధునిక మానవుడి జీవితానికి అన్ని వేళలా ఆయువు పోస్తున్న ప్రకృతి ప్రసాదించిన షడ్రుచుల సమ్మేళనమే ఉగాది







అన్నారు. ప్రతి ఒక్కరు సమాజ సేవకు తమ శక్తి కొలది కృషిచేయాలని సూచించారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలను గౌరవించి భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. బ్రహ్మ కుమారీస్ ప్రతినిధులు రామేశ్వరి అక్కయ్య మాట్లాడుతూ భగవంతుడు సర్వ శక్తివంతుడని వారు ఉంటేనే ఈ ప్రపంచం ఉంటుందని, ఎందుకంటే ఈ ప్రపంచంలో మంచితనం, దైవత్వం క్షీణించిన ప్రతిసారీ భావంతుని శక్తి వాటిని పునరిద్దుస్తుందన్నారు. ప్రపంచం లోని ప్రతి ఆత్మ కు తన ఆధ్యాత్మిక తేజస్సు ప్రసరింపజేసి శాంతి, ప్రేమ, ఆనందాన్ని నింపుతారన్నారు. భగవంతుడు ఈ సృష్టి యొక్క ఆది బిందువుగా అభివర్ణించారు. ప్రముఖ కొరియోగ్రాఫర్,



సీనియర్ జర్నలిస్టు నాగరాజు పట్నాయక్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

# విమానంలో బీడీ తాగుతూ పట్టుబడిన ప్రయాణికుడు

**ఇంటర్నెట్ డెస్క్:** సూరత్–కోల్‌కతా విమానంలో ఓ ప్రయాణికుడు బీడీ తాగుతూ సిబ్బందికి పట్టుబడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సూరత్ నుంచి కోల్‌కతా వెళ్తున్న విమానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం సాయంత్రం సూరత్ నుంచి కోల్‌కతా వెళ్లాల్సిన విమానంలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో టేకాఫ్ ఆలస్యం అయ్యింది. దీంతో ప్రయాణికులు అందులోనే నిరీక్షిస్తున్నారు. ఈ సమయంలో ఫ్లైట్‌లోని వాష్‌రూమ్‌లో నుంచి పొగ, వాసన రావడాన్ని సిబ్బంది గమనించి విమానాశ్రయ అధికారులకు సమాచారం అందించారు. వారు తనిఖీలు చేపట్టి పశ్చిమబెంగాల్‌కు చెందిన అశోక్ బిశ్వాస్ బ్యాగ్‌లో బీడీలు, అగ్గిపెట్టె ఉన్నట్లు గుర్తించారు.



అతడు వాష్‌రూమ్‌లో బీడీ తాగినట్లు గుర్తించి విమానం నుంచి దింపేశారు. దీంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. భద్రతా అధికారుల కళ్లుగప్పి ప్రయాణికుడు నిషేధిత వస్తువులను విమానంలోకి ఎలా తీసుకువచ్చాడనే విషయంపై దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇతర ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు కలిగించే అగ్గిపెట్టె వంటి వస్తువులను తీసుకువచ్చినందుకు అతడిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

## పేద బడుగు బలహీన వర్గాలకు టీడీపీతోనే మేలు

**విశాఖపట్నం, విశాఖ సమాచారమ్:** పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు టీడీపీ తోనే మేలు జరుగుతుందని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చోడే పట్టాభిరాం పేర్కొన్నారు. శనివారం జరిగిన టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలోని 17వ వార్డు చిన్నిపిల్లి వారి వీధిలో ఆయన మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ వల్లే పేదలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు మేలు జరుగు



తుందన్నారు. తమ అధినేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోం దన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు బైరెడ్డి పోతన రెడ్డి, 17వ వార్డు టీడీపీ నాయకులు గేదెల నాగరాజు, కాళ్ళ శంకర్, చిన్నిపిల్లి నరేంద్ర, రామిరెడ్డి, తారక రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైద్యురాలిపై సామూహిక అత్యాచారం జరగలేదు

## ఆర్జీకర్ సంఘటనపై సీబీఐ

**కోల్ కతా:** ఆర్జీకర్ హత్యాచార ఘటనలో ఒక నేరస్థుడి ప్రమేయం మాత్రమే ఉందని సీబీఐ హైకోర్టుకు తెలిపింది. పశ్చిమ బెంగాల్‌లోని ఆర్జీకర్ ప్రభుత్వ ఆసుపత్రిలో హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై విచారణ జరుపుతోన్న సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) కోల్‌కతా హైకోర్టుకు శుక్రవారం తన నివేదికను సమర్పించింది. అందులో వైద్యురాలిపై సామూహిక అత్యాచారం జరగలేదని పేర్కొంది. సీబీఐ తరఫు న్యాయవాది రాజ్‌దీప్ మజుందార్ ఘటనా స్థలంలో సేకరించిన డీఎన్ఏ నమూనాలకు ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహించినట్లు కోర్టుకి తెలిపారు. దాదాపు 14 మంది వైద్యులతో కూడిన మెడికల్ బోర్డు ఈ పరీక్ష ఫలితాలను పరిశీలించిందన్నారు. అనంతరం వైద్యురాలిపై సామూహిక అత్యాచారం జరగలేదని బోర్డు తేల్చిందని న్యాయస్థానానికి తెలిపారు. నేరస్థుడు సంజయ్‌రాయ్ ప్రమేయం మాత్రమే ఉందన్నారు. అయితే, ఈ కేసుకు సంబంధించి సాక్ష్యాలు నాశనం చేయడంతో పాటు పలువురి అధికారుల ప్రమేయం ఉందనే ఆరోపణలపై విచారణ జరుగుతోందన్నారు. మరోవైపు.. బాధిత కుటుంబానికి తొలుత సమాచారం ఇచ్చిన ఆస్పత్రి మహిళా అసిస్టెంట్‌ను సీబీఐ విచారించలేదని వైద్యురాలి కుటుంబం తరఫు న్యాయవాది సుదీప్త మైత్రా కోర్టుకు తెలియజేశారు. ఈ వాదనలు ఖండించిన సీబీఐ ఆమెను ఇప్పటికే విచారించినట్లు వెల్లడించారు. దర్యాప్తునకు ఇంత సమయం ఎందుకు పడుతోంది? అనే దానిపై కోర్టుకు నివేదికను సమర్పించాలని మైత్రా కోరారు. ఇక, ఈ కేసుకు సంబంధించి కోల్‌కతా పోలీసులు ప్రాథమికంగా రూపొందించిన కేసు డైరీతో పాటు ఇప్పటివరకు విచారించిన వ్యక్తుల జాబితాను సమర్పించాలని సీబీఐకి న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణ ఏప్రిల్ 23 తేదీకి వాయిదా వేసింది.

# తెలుగువారి గుండె చప్పుడు టీడీపీ

## భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

**విశాఖపట్నం, విశాఖ సమాచారమ్:** పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పుట్టిన తెలుగుదేశం పార్టీ తెలుగు వారి గుండె చప్పుడుగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అభివర్ణించారు. 43 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం రాంనగర్ లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్థాపించిన 9 నెలల్లోనే వందేళ్ల చరిత్ర గల కాంగ్రెస్ పార్టీని మట్టి కరిపించిన తెలుగుదేశానికి కార్యకర్తలే వెన్నెముకగా పేర్కొన్నారు. శుభ సూచకంగా భావించే పసుపును పార్టీ రంగుగా మార్చి, కార్మిక, కర్షక, పేద ప్రజలను ప్రతిబింబిస్తూ పార్టీ జెండాలో చక్రం, నాగలి, గుడిసె బొమ్మలను ఎన్టీఆర్ స్వయంగా తయారు చేసుకున్నారని వివరించారు. మంత్రి లోకేష్ చొరవతో కోటికి పైగా సభ్యత్వాల రికార్డు సాధ్యపడిందని చెప్పారు. లక్షకు పైగా సభ్యత్వాలతో భీమిలి ఉత్తరాంధ్రలో మొదటి స్థానంలో



నిలిచిందన్నారు. అంతకుముందు ఎంపీ ఎం. శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబులతో కలిసి కార్యాలయం ఆవరణలో జెండా ఎగురవేశారు. అనంతరం కార్యాలయంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# నేడు చిల్డ్రన్ ఎరీనాలో ఉగాది వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రసాద్ తెలిపారు. వేడుకలకు రాజకీయ, అధికార ప్రముఖులను, ప్రజలను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 9.00 గంటలకు వేడుకలు ప్రారంభంకానున్నాయని, నూతన తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకొని శాస్త్రోక్త పూజలు, వేదపారాయణ మంత్రోచ్ఛరణల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వేదపండితులు వేదపారాయణం, పంచాగ శ్రవణం, వేద పండితుల ఆశ్వీరచనం, కవిసమ్మేళం ఉంటుందన్నారు. ఉగాది పచ్చడితో పాటు ఇతర సంప్రదాయ ప్రసాదాలను ప్రజలకు అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. వివిధ పాఠశాల విద్యార్థులు, కళాకారుల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, విశ్వావసు నామ సంవత్సర విశేషాలను పంచాంగకర్తలతో పాటు, కవులు వివరించనున్నారని, అధికారులు, రాజకీయ ప్రముఖులు, విద్యార్థులు, సామాన్య ప్రజలు ఆశీలయ్యేందుకు వీలుగా, వేడుకలను వీక్షించేందుకు అనువుగా ఏర్పాట్లు చేశామని వివరించారు.

జిల్లా పర్యాటక శాఖ అధికారి, విశాఖపట్టణం ఆర్డీవో కార్యక్రమ నిర్వహణ బాధ్యతలు చూస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు, అధికారులు, రాజకీయ ప్రముఖులు, విద్యార్థులు ఉగాది వేడుకల్లో భాగస్వామ్యం కావాలని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

# 12వ వార్డులో టీడీపీ ఆవిర్భావ దినోత్సవం




**విశాఖపట్నం, విశాఖ సమాచారమ్:** విశాఖ తూర్పు నియోజకవర్గం, 12వ వార్డు లో తెలుగుదేశం పార్టీ43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా, పెదగదిలి, తోటగరువు అంబేద్కర్ జంక్షన్, దుర్గానగర్, పి ఐ సి పాయింట్, జంక్షన్ లో జెండాఆవిష్కరణ చేసికేక్ లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు అలాగే టిఐసి పాయంట్ వద్ద మజ్జిగ పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు, వార్డు అధ్యక్షులు, గాడి సత్యం, వార్డు ఇంచార్జి, ఒమ్మి అప్పలరాజు, పార్లమెంట్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఒమ్మి పోలరావు, పార్లమెంట్ పార్టీ సెక్రటరీ, ఏడువాక సన్యాసిరావు, వార్డు సెక్రటరీ, పోతిన భరత్, పూలపావెంకట్,సూరల బ్రహ్మం కొత్తలి గోపాల్, దువ్వి తాతరావు, పరదేశీ ఆనంద్, అప్పలనాయుడు తదితరులతోపాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# పార్టీ మాకు కన్నతల్లి వంటిది

(మొదటి పేజీ తరువాయి)

నిలబడిరది. దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. చంద్రబాబు నాయకత్వంలో కలసికట్టుగా ముందుకెళ్తున్నాం. బడుగు, బలహీన వర్గాలను ఆదుకుంటున్న పార్టీ టీడీపీ. ఈ పార్టీ మాకు కన్న తల్లి వంటిది. తెలుగు వాళ్లు ఎక్కడున్నా పార్టీ అక్కున చేర్చుకుంటుంది" అని అన్నారు.

# తెలుగు వారు ఉన్నంత వరకు టీడీపీ ఉంటుంది

(మొదటి పేజీ తరువాయి)

వచ్చాయి.. అవకాశంగా తీసుకుని విజయాలు సాధిస్తున్నాం. పార్టీనే ప్రాణంగా బతికే పసుపు సైన్యానికి మనస్ఫూర్తిగా పాదాభివందనం చేస్తున్నా" అని చంద్రబాబు అన్నారు.

## రెడ్ బుక్ పేరు వింటేనే కొందరికి గుండెపోటు: లోకేశ్

పార్టీలో సంస్కరణలపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీలో సంస్కరణలు తనతోనే మొదలు కావాలని ఆయన అన్నారు. మూడు సార్లు ఒకే పదవిలో ఉన్న వారు ఆ తర్వాతి స్థాయికి వెళ్లాలి లేదా బ్రేక్ తీసుకోవాలన్నారు. నాలుగు సార్లు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న తన నుంచే ఈ సంస్కరణ ప్రారంభించాలని ప్రతిపాదిస్తున్నానన్నారు. గ్రామస్థాయి నాయకులు రాష్ట్ర నేతలుగా ఎదిగి పొలిట్ బ్యూరోలోకి అడుగుపెట్టాలని ఆకాంక్షించారు. యువతకు రెక్కలు వచ్చి రాజకీయాల్లోకి రావాలని లోకేశ్ పిలుపునిచ్చారు. సీనియర్లు, జూనియర్లకు సమ ప్రాధాన్యం ఇస్తామన్న ఆయన.. పని చేసే వారికి మాత్రమే ప్రమోషన్లు ఉంటాయని వెల్లడిరచారు. పార్టీలో యువరక్తం నింపేందుకు ప్రతి ఒక్కరి సహకారం కావాలని కోరారు. తాను ఎక్కడ మాట్లాడుతున్నా రెడ్ బుక్ ప్రస్తావన వస్తోందన్న ఆయన.. రెడ్ బుక్ పేరు వింటేనే కొందరికి గుండెపోటు వస్తోంది, ఇంకొందరు బాత్రూమ్‌ల్లో జారిపడతున్నారని విమర్శించారు. ఇగోలు, అధికార గర్వం పక్కన పెట్టి అంతా కలసికట్టుగా పనిచేద్దామని లోకేశ్ పిలుపునిచ్చారు.

## ఎన్టీఆర్‌కు నివాళి

ముందుగా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, పార్టీ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పార్టీ జెండా ఎగురవేశారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎన్టీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు అంతా కష్టపడాలన్నారు. స్వర్ణాంధ్ర నిర్మాణంలో చంద్రబాబు, లోకేశ్ వెంట ఉండాలని చెప్పారు. తన ప్రాణం ఉన్నంతవరకు చంద్రబాబు అడుగుజాడల్లో నడుస్తానన్నారు.



# స్వచ్ఛందంగా దేశాన్ని వీడండి

(మొదటి పేజీ తరువాయి)

యాక్టివ్‌గా ఉండటం వల్ల కలిగే పరిణామాలు, భావ ప్రకటనా స్వేచ్ఛ పరిమితులపై ఆందోళన రేకెత్తుతోంది. జాతి వ్యతిరేక ప్రచారానికి పాల్పడుతున్న వారి సోషల్ మీడియా ఖాతాలను అమెరికా విదేశాంగశాఖ జల్లెడ పడుతోంది. ఒకవేళ అదే నిజమని తేలితే ఆ విద్యార్థులకు అమెరికాలో చదువుకునే వీల్లేకుండా తక్షణమే స్వదేశానికి పంపించే యోచనలో ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఈమేరకు అమెరికా విదేశాంగశాఖ, కాన్సులేట్ అధికారుల సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెలువరించింది. 'బ్యూరో ఆఫ్ కాన్సులర్ అఫైర్స్ వీసా' నుంచి విదేశీ విద్యార్థులకు ఈమెయిల్స్ వెళుతున్నాయి. "యునైటెడ్ స్టేట్స్ ఇమిగ్రేషన్, అమెరికా జాతీయచట్టం లోని సెక్షన్ 221(i) ప్రకారం.. మీ వీసా రద్దయింది. ఈ మేరకు స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ప్రోగ్రామ్‌కు బాధ్యత వహించే అధికారులకు సమాచారం వెళ్లింది. మీ వీసా రద్దు అంశం గురించి సంబంధిత కళాశాల యాజమాన్యానికి వారు తెలియజేయవచ్చు" అన్నది మెయిల్ సారాంశం. సరైన అనుమతి లేకుండా దేశంలో ఉంటే నిర్బంధించడంతో పాటు భవిష్యత్‌లో వీసా రాకుండా చేస్తామని హెచ్చరిక సందేశాల్లో అమెరికా విదేశాంగశాఖ పేర్కొంది. హెచ్చరిక సందేశాలు వచ్చినవారు.. తమ స్వదేశాలకు వెళ్లేందుకు సీబీపీ హోమ్ యాప్ ఉపయోగించుకోవచ్చని తెలిపింది.

# చేతులు, ముఖంపై గాయాలు

## పాస్టర్ ప్రవీణ్ మృతి కేసులో కొనసాగుతున్న దర్యాప్తు

**రాజమహేంద్రవరం:** ద్విచక్ర వాహనంపై వస్తూ ఈనెల 24న అర్ధరాత్రి రాజమహేంద్రవరం సమీపంలోని కొంతమూరు వద్ద ప్రాణాలు కోల్పోయిన పాస్టర్ పగడాల ప్రవీణ్‌కుమార్ కేసు దర్యాప్తును పోలీసులు వేగవంతం చేశారు. అనుమానాస్పద స్థితిలో కొంతమూరు సమీపంలో పాస్టర్ ప్రవీణ్ కుమార్ మృతి చెందినట్టు గుర్తించామని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ తెలిపారు. మృతిపై అనుమానాలు వ్యక్తం కావడంతో పాస్టర్ బంధువులు వచ్చిన తర్వాత కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కేసు వివరాలను ఐజీ వెల్లడించారు. "తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ స్వీయ పర్యవేక్షణలో ఇద్దరు డీఎస్పీలు, 4 బృందాలు ఈ కేసును దర్యాప్తు చేస్తున్నాయి. ఈ నెల 24న




ఉదయం 11 గంటలకు ప్రవీణ్ హైదరాబాద్ నుంచి బయలుదేరారు. అదే రోజు మధ్యాహ్నం 1.29 గంటలకు చౌటుప్పల్ వద్ద టోల్ గేట్ దాటారు. విజయవాడ చేరుకున్నాక 3 గంటల పాటు ఆయన ఎక్కడున్నారనే విషయంపై ఆరా తీస్తున్నాం. కొంతమూరు పెట్రోల్ బంక్ వద్దకు రాత్రి 11.40 గంటలకు ప్రవీణ్ చేరుకున్నారు. 11:42 గంటలకు ఘటన జరిగింది. పోస్టుమార్టం నివేదిక ప్రకారం పాస్టర్ చేతులు, ముఖం పైన కొన్ని గాయాలున్నాయని తేలింది. వివరాలు పూర్తిగా వచ్చిన తర్వాత ప్రవీణ్ ఎలా మృతి చెందారనే విషయంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కారు ఢీ కొడితే మోటార్ సైకిల్ కింద పడిందా లేదా.. అన్న విషయాన్ని కూడా ట్రాన్స్‌పోర్టు అధికారులు పరిశీలిస్తున్నారు. విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ఎలాంటి అసత్య ప్రచారాలు చేయొద్దు" అని ఐజీ పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో భాగంగా హైదరాబాద్, విజయవాడలో ఉన్న సీసీ కెమెరాల ద్వారా డేటా పరిశీలిస్తామని ఎస్పీ డి.నరసింహకిశోర్ తెలిపారు. "అన్ని టోల్ గేట్ల వద్ద సీసీ ఫుటేజ్ తీసుకున్నాం. రాజమహేంద్రవరం ఎందుకు వచ్చారో పరిశీలించాం. లాలా చెరువు సమీపంలో కుమార్తె పేరిట ప్రవీణ్ కొంత స్థలం కొనుగోలు చేసినట్లు తెలిసింది. అక్కడ ఒక భవనం నిర్మించాలనుకున్నారు. దీని కోసం ఒక ఇంటిని కూడా అద్దెకు తీసుకున్నారు. ఆయన రాజమహేంద్రవరం వస్తున్నట్టు భార్య, స్థానికంగా ఉంటున్న ఆకాష్, జాన్‌కు మాత్రమే తెలుసు. కుటుంబ సభ్యులందరినీ విచారించాం. ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్స్ కూడా పరిశీలిస్తాం" అని ఎస్పీ తెలిపారు.

# భారీ ఎన్‌కౌంటర్...

(మొదటి పేజీ తరువాయి)

బలగాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నట్లు తెలిపారు. గాయపడిన సిబ్బంది డీఆర్జీ విభాగానికి చెందిన వారిగా పేర్కొన్నారు.

## భారీగా ఆయుధాలు స్వాధీనం

సంఘటనా స్థలం నుంచి 16 మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భారీ మొత్తంలో ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్ రాజ్ మీడియాకు తెలిపారు. పెద్ద సంఖ్యలో ఏకే–47 రైఫిల్స్‌తోపాటు, సెల్ఫ్ లోడింగ్ రైఫిల్ (ఎస్ఎల్ఆర్), ఇన్సాస్, రాకెట్ లాంచర్, బరెల్ గ్రనేడ్ లాంచర్ (బీజీఎల్)లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఇంకా ఆపరేషన్ కొనసాగుతోందని మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని ఆయన పేర్కొన్నారు.

## మావోయిస్టుల దుశ్చర్య.. ఐఈడీ పేలి ఇద్దరు చిన్నారుల మృతి

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు దుశ్చర్యకు పాల్పడ్డారు. వారు అమర్చిన ఐఈడీ పేలిన ఘటనలో ఇద్దరు చిన్నారులు మృతి చెందగా.. మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈమేరకు బీజాపూర్ పోలీసులు వెల్లడించారు. అటవీ ప్రాంతంలోకి వెళ్లే మార్గంలో మావోయిస్టులు గతంలో ఐఈడీ అమర్చారు. అడవిలో పండ్లు ఏరుకునేందుకు తన పిల్లలతో కలిసి వెళ్లిన మహిళ తిరిగి ఇంటికి వస్తుండగా.. అనుకోకుండా దానిపై కాలు వేయడంతో ఒక్కసారిగా అది పేలిపోయింది. ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలు కాగా.. ఇద్దరు పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. స్థానికులు ఆమెను దగ్గర్లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.

# జీవీఎంసీ ఆర్థిక బడ్జెట్‌కు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

ఈ వార్షిక బడ్జెట్‌కు జీవీఎంసీ స్థాయి సంఘం డిసెంబర్‌లో ఆమోద ముద్ర వేసింది. 2025 – 26 వార్షిక బడ్జెట్ ప్రారంభపు నిల్వ రూ.482.26 కోట్లు, అన్ని పద్దుల కింద జమలు రూ.427.96 కోట్లు, ప్రారంభపు నిల్వతో కలిపి మొత్తం జమలు రూ.476.18 కోట్లు, అన్ని పద్దుల కింద ఖర్చులు రూ.460.14 కోట్లు. ముగింపు నిల్వగా రూ.16.04 కోట్లుగా చూపారు. కాగా సమావేశానికి చాలామంది వైసిపి కార్పొరేటర్లు హాజరు కాలేదు.

30 Vs 3.qxd 3/29/2025 5:25 PM Page 1



## జన సైనికుల అత్యవసర సమావేశం



**తాళ్ళపూడి., (విశాఖ సమాచారం) :** తాళ్లపూడి మండలం జనసేన పార్టీ అత్యవసర సమావేశమయ్యారు. కొవ్వూరు నియోజకవర్గం జన సేన పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జన సైనికులకు, వీర మహిళలకు అన్యాయం జరిగిందని, ఏదేమైనప్పటికీ మా అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు జన సేన, తెలుగు దేశం, బిజెపి, కలిసే పని చేస్తున్నాయన్నారు. ఆరికరేవుల దగ్గరనుంచి ఎన్నో ఇసుక ర్యాంపులు వచ్చాయ్ కానీ తాళ్లపూడి మండలం ఇసుక ర్యాంపులో జన సైనికులకి తీరని అన్యాయం జరిగిందని చెప్పారు. జన సైనికులు అంటే పేదవారు అలాంటి పేద వారికి ఇసుక ర్యాంపుల్లో తగు భాగస్వామ్యం ఇప్పించవల సిందిగా, కార్పొరేషన్ విషయంలోనూ, సొసైటీలోనూ మేము అడిగింది ఇది కాదు అది అని చెప్పేసి ప్రక్కదోవ పట్టించే పరిస్థితు లు నెలకొన్నాయని , ఏది ఏమైనా జన సైనికుల సహనాన్ని పరీక్షించ వద్దని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జనసైనికులు నా యకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇసుక మేటల తొలగింపునకు వినతి



**తాళ్లపూడి, (విశాఖ సమాచారమ్) :** తాళ్లపూడి మండలం ప్రక్కలంక ఇసుక ర్యాంపుకి 100 మీటర్ల దూరంలో ఏటిగట్టు పైన ఇసుక లోడు ట్రాక్టర్ రన్నింగ్‌లో వెళ్తుండగా చక్రం ఊడిపడి ట్రాక్టర్ బోల్తా పడడంతో రోడ్డుపై ఇసుక ఉండిపోవడంతో ప్రయాణికులు, వాహన దారులు నానా ఇబ్బంది పడుతున్నారు. మోటర్ సైకిల్ నడిపే వారు జారి పడుతున్నారు. కావున అధికారులు వెంటనే స్పందించి రోడ్డు పై చెల్లా చెదురుగా పడిన ఇసుకను వెంటనే తీయించిరోడ్డు క్లియర్ చేయవలసిందిగా ప్రయాణికులు కోరుతున్నారు.

# టీడీపీ సీనియర్ నేత శేషు కుమార్ మృతి



**నర్సీపట్నం (విశాఖ సమాచారమ్):-**సీనియర్ టిడిపి నాయకుడు,మాకవరపాలెం మండలం మాజీ జడ్పిటిసి రుత్తల శేషు కుమార్ అనారోగ్యంతో మరణించారు. గతకొద్ది కాలంగా కాలేయ వ్యాధితో బాధపడుతున్న శేషు కుమార్ శుక్రవారం అర్ధరాత్రి తుది శ్వాస విడిచారు. మండలంలోని ప్రజలందరికీ తలలో నాలికలా ఉండే శేషు కుమార్ అకాలంగా మృతి చెందడంతో మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి.శేషు కుమార్ మరణించారన్న వార్త విన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి శేషు కుమార్ పార్ధివ దేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్న శేషు కుమార్ మాకవరపాలెం సర్పంచిగా, ఎంపీటీసీగా, జడ్పిటిసిగా, మండల పార్టీ అధ్యక్షుడుగా అనేక పదవులను అలంకరించారు.తాజాగా రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్ కమిటీలకు చైర్మన్ లను పార్టీ అదిష్టానం ప్రకటించింది. అయ్యన్నపాత్రుడు సిఫార్సు మేరకు నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్గా శేషు కుమార్ పేరును శుక్రవారం ప్రకటించారు. ఆ మరుసటి రోజే శేషు కుమార్ మృతి చెందడం పార్టీ నాయకులను కలిచివేసింది.అదే విధంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజునే పార్టీ సీనియర్ నాయకుడు మృతి చెందడాన్ని కార్యకర్తలు, నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. పార్టీ కోసం అహర్నిశలు పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషి చేసిన, నిబద్ధత కలిగిన నాయకుడును కోల్పోయామని అయ్యన్నపాత్రుడు ఆవేదన వ్యక్తం చేశారు. శేషు కుమార్‌ను చివరిసారిగా చూసేందుకు మండల ప్రజలు బారులు తీరారు.

# రూ.10 కోట్లతో నూకాంబిక ఆలయ అభివృద్ధి

## జిల్లా ఇంచార్జి మంత్రి కొల్లు రవీంద్ర




**అనకాపల్లి, (విశాఖ సమాచారం బ్యూరో):** అనకాపల్లి నూకాంబిక అమ్మ వారి వార్షిక జాతర మహెూత్సవాలు ప్రారంభోత్సవం సందర్భంగా శనివారం ఉదయం రాష్ట్ర గనులు, భూగర్భ, ఎక్సైజ్ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి కొల్లు రవీంద్ర రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ నూకాంబిక అమ్మ వారి వార్షిక జాతర మహెూత్సవాలు పార్లమెంటు సభ్యులు సి.ఎం.రమేష్, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణగారి కృషి ఫలితంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర పండుగగా ప్రకటించడం ఆనందదాయకమని తెలిపారు. రాష్ట్ర పండుగగా ప్రకటించిన తరువాత తొలిసారిగా నిర్వహిస్తున్న వార్షిక జాతర మహెూత్సవాలకు అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించడం తన అదృష్టమన్నారు. దేవాలయాన్ని సుమారు పదికోట్ల రూపాయలు నిధులతో నిర్మాణం, అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. దేవాలయ నిర్మాణం, అభివృద్ధి పనులు పూర్తయిన తరువాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వారి చేతుల మీదుగా ప్రారంభించడం జరుగుతుందన్నారు. దేవాలయం అభివృద్ధి పనులు, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు మూలంగా భవిష్యత్తులో ఎక్కువ మంది భక్తులు వస్తారని, అనకాపల్లి పర్యాటకంగా కూడా అభివృద్ధి చెందుతుందని తెలియజేసారు. దేవాలయం అభివృద్ధికి ప్రభుత్వం తరపు నుండి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్ బాబు, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంటు కార్పొరేషను చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, ఎ.పి.గవర సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషను చైర్మన్ మల్ల సురేంద్ర, కొప్పులవెలమ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషను చైర్మన్ పి.వి.జి. కుమార్, ఆలయ చైర్మన్ పీలా నాగశీను, దాడి రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నూకాలమ్మను దర్శించుకున్న ఎంపీ సీఎం రమేష్ దంపతులు



**అనకాపల్లి (విశాఖ సమాచారమ్) :** అనకాపల్లి తాకాశి వీధిలో పుట్టలో స్వయంభూగా వెలసిన నూకంబిక అమ్మవారు కొత్త అమావాస్య మహెూత్సవ భాగంగా శనివారం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు.అమ్మవారిని పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్క రించారు.ఈ కార్యక్రమంలో ఆల య అభివృద్ధి కమిటీ చైర్మన్ తాకాసి రాజేష్, జనసేన పార్టీ నాయకులు గెడ్డం బుజ్జి, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త , తాకాశి కన్న బాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ తాకాసి కిషోర్, తాకాశి వీధి పంచాయతీ పెద్దలు, ఉత్సవ కమి టీ, సభ్యుల, ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు, పాల్గొన్నారు. తాకాశి కొండల రావు, తాకాశి సూర్యా రావు, బేతి ఈశ్వర రావు, బోయి న వరహాలు తాడి రామకృష్ణ, గంగుపోవు మహేష్ దోర, తాకాశి సత్యం దోర, తాకాశి నాగే ష్, తాకాశి విశ్వేశ్వ రావ్, దట రమణ బాబు, పలక చంటి, దొండ రామారావు, తాకాశి కిషో ర్, తాకాశి నరేష్, తాకాశి అనిల్, కారుకొండి కన్నా, పల్లెల సురేష్, బలిరెడ్డి సత్య, చింతల నవీన్,బుర్ర అశోక్, బుగత అశోక్, తాకాశి వీధి నివా సితులు పాల్గొన్నారు.

# ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం




తాళ్ళపూడి, (విశాఖ సమాచారమ్): తెలుగు దేశం పార్టీ ఆవిర్భావం సందర్భంగా అన్నదేవరపేటలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. 43 వసంతాల సుదీర్ఘ ప్రయాణంలో పార్టీ కి వెన్నంటి ఉన్న సీనియర్ నాయకులు, కార్యకర్తల త్యాగాలను గుర్తించి వారికి శాలువాలు కప్పి తెలుగుదేశం పార్టీపై అభిమానాన్ని చాటుకున్నారు.

కొవ్వూరు: తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఆవిర్భావ దినోత్సవం వేడుకల్లో కొవ్వూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు తెలుగుదేశం సీనియర్ నాయకులను దుశ్శాలవతో సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో టు మెన్ కమిటీ సభ్యులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**అనకాపల్లి :** స్థానిక రింగ్ రోడ్‌లో ఉన్న లక్ష్మీనారాయణ నగర్ లో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవం శనివారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ అన్న స్వర్గీయ నందమూరి తారక రామారావు పేదవారి అభ్యున్నతి కోసం, సమాజసేవే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీని స్థాపించారని స్థాపించిన తొమ్మిది నెలలోనే అఖండ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. పేదల కోసం కిలో రెండు రూపాయల బియ్యాన్ని దేశంలో మొట్టమొదటిసారిగా అందించిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందన్నారు. నందమూరి తారక రామారావు తరువాత పార్టీ పగ్గాలను నారా చంద్రబాబునాయుడు అందుకొని పార్టీని నేటి వరకు విజయపథంలో నడిపిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో అనేక సమస్యలు ఉన్నప్పటికీ వాటన్నింటిని సరిచేస్తూ ప్రజా రంజకమైన పాలనను అందిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అభివృద్ధి పాలన జరుగుతున్నదని పారిశ్రామిక విప్లవం దిశగా అడుగులు వేస్తున్నదని అన్నారు. కార్యకర్తలే మొదటి ప్రాధాన్యతగా తెలుగుదేశం పార్టీ ప్రతీ కార్యకర్త యొక్క సంక్షేమమే లక్ష్యంగా కోటికి పైగా సభ్యత్వాలతో రికార్డు స్థాయిలో దేశంలో ఏ పార్టీకి లేనటువంటి కార్యకర్తలను తెలుగుదేశం పార్టీ కలిగి ఉన్నదని అన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం ప్రతి కార్యకర్తకు ప్రమాద బీమా 5 లక్షల రూపాయలను పార్టీ అందిస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు బొడ్డపాటి చిన్న రాజారావు, వేగి దొరబాబు, యాల్లపు శ్రీనివాస్, కటారి దేవుడు, రేభక మధుబాబు, దొడ్డి రమణ, మళ్లీ రమణబాబు, కోటిపల్లి శ్రీను, కోరుబిల్లి ఆరుద్ర, ఆళ్ల ప్రవీణ్ కుమార్, కాండ్రేగుల రవి కిషోర్, పలక కాసులు ఆడారి రవికుమార్, గాజుల రాంబాబు, బుద్ధ శేఖర్, కోయిలాడ నాగు తదితరులు పాల్గొన్నారు.



# పరవాడలో ఘనంగా నూకాంబిక అమ్మవారి జాతర

**పరవాడ, (విశాఖ సమాచారమ్):** మండల కేంద్రమైన పరవాడలో నూకాంబిక అమ్మవారి జాతరను శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు, సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. తెల్లవారుజాము 5 గంటల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుండి ఆలయం వద్ద ఏర్పాటు చేసన భారీ అన్న సమారాధనలో సుమారు 3000 మంది పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పైల అప్పారావు, టిడిపి అధికార ప్రతినిధి పైల రామచంద్రరావు, పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ రావు, మాజీ. ఆర్.ఇ.సి ఎస్ మాజీ చైర్మన్ చల్ల కనకారావు, పైల పోతునాయుడు, వార్డు మెంబర్లు వర్రీ లక్ష్మి, గండి ఈశ్వరరావు, వర్రి హరి, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## విద్య, ఉద్యోగ సమాచారం

### కేరళ ఫైనాన్షియల్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో ఖాళీలు




**కేరళ ఫైనాన్షియల్** కార్పొరేషన్ (కేఎఫ్‌సీ)లో డిప్యూటీ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఏప్రిల్ 28వ తేదీ వరకు అభ్యర్థులు దరఖాస్తు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్టు పేరు-ఖాళీలు

డిప్యూటీ మేనేజర్(జనరల్ వింగ్): 05

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(జేఏఐఐబీ), బీఈ, బీటెక్, ఎల్ఎల్‌బీ, ఎంబీఏలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 28-03-2025 నాటికి 35 ఏళ్ల లోపు ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

జీతం: నెలకు రూ.65,800 - రూ.1,25,200.

దరఖాస్తు ప్రక్రియ: ఆన్‌లైన్ ద్వారా.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తు చివరి తేదీ: 28-04-2025.

### ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీలో ఫ్యాకల్టీ పోస్టులు



**ఇండియన్ మారిటైమ్** యూనిర్సిటీ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఏప్రిల్ 21వ తేదీ వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

విభాగాలు: ఓషన్ ఇంజినీరింగ్, మ్యాథ్స్, మెకానికల్ ఇంజినీరింగ్

పోస్టు పేరు-ఖాళీలు

1. అసోసియేట్ ప్రొఫెసర్(ఓషన్ ఇంజినీరింగ్): 01
2. అసిస్టెంట్ ప్రొఫెసర్(ఓషన్ ఇంజినీరింగ్): 01
3. అసిస్టెంట్ ప్రొఫెసర్(మ్యాథ్స్): 05
4. అసిస్టెంట్ ప్రొఫెసర్(మెకానికల్ ఇంజినీరింగ్): 03

మొత్తం ఖాళీల సంఖ్య: 10

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: అసోసియేట్ ప్రొఫెసర్‌కు 60 ఏళ్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు 50 ఏళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

జీతం: అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.37,400 - రూ.67,000, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.15,600 - రూ.39,100.

దరఖాస్తు ప్రక్రియ: ఆన్‌లైన్ ద్వారా

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1000, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.700.

దరఖాస్తు ప్రారంభ తేదీ: మార్చి 29

దరఖాస్తు చివరి తేదీ: ఏప్రిల్ 21

### విక్రమ్ సారాబాయ్ స్పేస్ సెంటర్‌లో టీచింగ్ ఖాళీలు




**కేరళ రాష్ట్రం** తిరువనంతపురంలోని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో)విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్.. కింది ఖాళీల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.

పోస్టు పేరు-ఖాళీలు

- పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (ఫిజిక్స్)- 01
- ప్రైమరీ టీచర్- 01
- సబ్ ఆఫీసర్- 01

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంఎస్సీ, మాస్టర్స్ డిగ్రీ, బీఎడ్, బీఈఎల్ఎడ్, బీఎస్సీ ఉత్తీర్ణతతో పాటు టీచింగ్ నైపుణ్యాలు, ఉద్యోగానుభవం ఉండాలి.

వయోపరిమితి: పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్‌కు 40 ఏళ్లు, ప్రైమరీ టీచర్‌కు 30ఏళ్లు, సబ్ ఆఫీసర్‌కు 35ఏళ్లు మించకూడదు.

వేతనం: నెలకు పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టుకు రూ.47,600- రూ.1,51,100బీ ఇతర పోస్టులకు రూ.35,400- రూ.1,12,400.

ఎంపిక ప్రక్రియ: పోస్టును అనుసరించి రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, పీఈటీ, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.

దరఖాస్తు చివరి తేదీ: 09.04.2025




తెలుగువారి ముఖ్యమైన పండుగలలో ఒకటైన ఉగాది, తెలుగు వారు అత్యంత వైభవంగా చైత్ర శుద్ధ పాడ్యమి రోజున జరుపుకునే ఈ పండుగను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలతో పాటు విదేశాల్లోనూ తెలుగు ప్రజలు ఘనంగా జరుపుకుంటారు. ఉగాది అంటేనే కొత్త ఏడాది ఆరంభానికి సంకేతం. ఈ 2025, మార్చి 30న, శ్రీక్రోధినామ సంవత్సరం ముగిసి, శ్రీవిశ్వావసు నామ సంవత్సరం ప్రారంభమౌతుంది. 60తెలుగుసంవత్సరాలలో శ్రీ విశ్వావసునామ సంవత్సరం 39వది.

**పురాణ గాధలు, చరిత్రలో ప్రత్యేకత:**

"ఉగాది" అనే పదం "యుగ" మరియు "ఆది" అనే సంస్కృత పదాల సమ్మేళనంగా భావించబడుతుంది. పురాణాల ప్రకారం, ఈ రోజున బ్రహ్మదేవుడు సృష్టి ఆరంభించాడని, మరియు బ్రహ్మ కాల గణనను మొదలుపెట్టాడని చెబుతారు. శాలివాహన చక్రవర్తి చైత్రశుక్ల పాడ్యమినాడే పట్టాభిషిక్తుడై తన శౌర్యపరాక్రమాలతో శాలివాహన యుగకర్తగా భాసిల్లిన కారణాన ఆ యోధాగ్రని స్మృత్యర్థం ఉగాది ఆచరింపబడుతుందని చారిత్రక వృత్తాంతం. ఏది ఏమైనా జడప్రాయమైన జగత్తులో చైతన్యాన్ని రగుల్కొల్పి మానవాళిలో నూతనాశయాలను అంకురింపచేసే శుభదినం 'ఉగాది'. ఈ కారణంగా, ఉగాది చరిత్ర పరంగా, సంప్రదాయ పరంగా, భక్తి పరంగా ఎంతో ప్రత్యేకమైన పండుగ.

**ఉగాది ప్రత్యేకత - ప్రకృతితో అనుబంధం:**

ఉగాది పండుగ వసంత ఋతువు ఆరంభంలో వస్తుంది. ప్రకృతి తన హరిత వస్త్రాన్ని ధరించి కొత్త పచ్చదనంతో మెరిసిపోతుంది. పక్షులు మధురమైన గానాలతో ప్రకృతిని అలరిస్తాయి. మామిడి చెట్లు కొత్తగా పూసే కాయలతో నిండి ఉంటాయి. వీటినే ఉగాది పచ్చడిలో ఉపయోగించడం సంప్రదాయం. ఉగాది పచ్చడిలో మామిడి కాయ, వేప పువ్వు, బెల్లం, చింతపండు, ఉప్పు, మిరప వేసి తయారు చేస్తారు. ఈ పచ్చడిలోని చేదు, తీపి, పులుపు, ఉప్పు, కారం, వగరు వంటి ఆరు రుచులు జీవితంలోని వివిధ అనుభవాలను సూచిస్తాయి. వేప పువ్వులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని మన పూర్వీకులు విశ్వసించారు.

ప్రకృతిలో మార్పులను గమనించడం, వాటితో అనుసంధానం కావడం మన సంప్రదాయంలో భాగం. ఉగాది నాడు ప్రకృతిని పూజించే సంప్రదాయం ఉంది. ఆనాడు ప్రకృతి దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇది ప్రకృతితో మనిషికి ఉన్న గాఢమైన అనుబంధాన్ని సూచిస్తుంది.మకర సంక్రాంతిరోజు పూర్వీకులకు బట్టలు చూపడం ఆచారమైతే, రాయలసీమలో ఉగాది నాడు పూర్వీకులకు బట్టలు చూపడం ఒక ఆనవాయితీ.

**రైతులకు కొత్త ఆశలు:**

రైతు జీవితంలో ఉగాది ఒక కొత్త ప్రారంభానికి సంకేతం. పంట కాలం మార్పుతో రైతులు కొత్త ఆశలు నెత్తిన పెట్టుకుంటారు. పంచాంగ శ్రవణం ద్వారా భవిష్యత్తు వాతావరణ పరిస్థితులు, వ్యవసాయ అనుకూలతలు తెలుసుకునే ప్రక్రియ కొనసాగుతుంది. పంటలు, వానపాతం, రాజనీతి, ఆర్థిక వ్యవస్థ తదితర అంశాలపై పండితులు పంచాంగ శ్రవణంలో వివరంగా వివరించడం ఒక సంప్రదాయంగా కొనసాగుతోంది. ఈ రోజుల్లో సాంకేతిక పరిజ్ఞానం పెరిగి వాతావరణ విషయాలు ముందుగానే తెలుస్తున్నాయి. కాని ఒకప్పుడు పంచాంగ శ్రవణం ద్వారా రైతులు రాబోయే వర్షపాతం, పంటలకు అనుకూలమైన కాలం గురించి తెలుసుకుంటూ ఉండేవారు.

**భారతదేశంలోని ఉగాది వేడుకలు:**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో తెల్లవారు జామున నూనె స్నానం, రంగవల్లులు, మామిడి తోరణాలతో ఇళ్లు అలంకరించడం ప్రధాన ఆనవాళ్లుగా ఉంటాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి పండితులు పంచాంగ శ్రవణం చేస్తారు. ప్రత్యేకంగా విజయవాడ కనకదుర్గా ఆలయం, తిరుపతి వేంకటేశ్వరస్వామి ఆలయం, యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు.

కర్ణాటకలో "యుగాది" పేరుతో ఇదే ఉత్సాహంతో పండుగను జరుపుకుంటారు. ఇక్కడ "బేవు-బెల్లద" అనే ప్రత్యేక వంటకాన్ని తింటారు, ఇది ఆరు రుచులను కలిగి ఉండి జీవితంలోని అనేక అనుభవాలను సూచిస్తుంది. మహారాష్ట్ర, గోవాలో దీనిని "గుడి పడ్వా" అనే పేరుతో జరుపుకుంటారు. ఇక్కడ ఇంటి ముందు గుడి (గోపురం) ఏర్పాటు చేసి, రంగవల్లులు వేయడం ప్రత్యేకత. . "పురన్ పోలి" అనే ప్రత్యేక వంటకాన్ని తయారు చేసుకుంటారు.

కశ్మీర్ వారు "నవ్రేహ్"పేరుతో, అస్సాం వారు "బిహు" పేరుతో,రాజస్థాన్ వారు "థప్న" పేరుతో, "సాజిబునొగ్మపంబ" పేరుతో మణిపూర్ వారు, "భక్షి", "వైశాఖి" పేరుతో పంజాబ్ వారు,"వైశు"పేరున కేరళ వారు, "చేథి చంద్" పేరుతో సింధి వారు, "నబ-బర్ష" పేరుతో బెంగాల్ వారు,"పుథండు" పేరుతో తమిళవారు, "న్యెపి" పేరునఇండొనేషియాలో జరుపుకుంటారు.

**పంచాంగ శ్రవణం**

ఉగాది నాడు పండితులు కొత్త పంచాంగాన్ని పఠిస్తారు. ఈ సమయంలో నూతన సంవత్సర నామం, రాజు, మంత్రి, వర్షాలు, పంటలు మరియు నక్షత్ర స్థితిగతుల గురించి వివరిస్తారు. ప్రజలు ఈ పంచాంగ శ్రవణం ద్వారా వచ్చే సంవత్సరం ఎలా ఉంటుందో తెలుసుకుంటారు. అదాయము, వ్యయం, రాజ్యపూజ్యం, అవమానం, కందాయ ఫలాలు తెలుసుకుంటారు. విదేశాలలో కూడా కొన్ని తెలుగు సంఘాలు ఆన్‌లైన్ ద్వారా పంచాంగ శ్రవణ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తాయి. భారత దేశం నుండి పండితులను ప్రత్యేకంగా ఆహ్వానించి, ఈ కార్యక్రమాలను నిర్వహిస్తారు.

**విదేశాల్లో ఉగాది:**

అమెరికా, కెనడా, యునైటెడ్ కింగ్‌డమ్, ఆస్ట్రేలియా, మిడిలీస్ట్ దేశాలలో నివసించే తెలుగు ప్రవాసులు ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా తెలుగు సంఘాలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, పిల్లలకు భాషా పోటీలు, సంగీత, నాట్య ప్రదర్శనలను అందుబాటులోకి తెస్తున్నారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ ఉగాది పచ్చడి అందరికీ పంచడం విశేషం. సింగపూర్, మలేషియా, దుబాయ్, అబుదాబి, ఖతార్ వంటి దేశాలలో కూడా తెలుగు ప్రవాసులు ఉగాది పండుగను జరుపుకుంటారు. ఈ రోజున తమ కుటుంబాలతో కలిసి ఆలయాలకు వెళ్లి, సాంప్రదాయిక వంటకాలు వండుకుని, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

**సాంకేతికతతో ఉగాది సంబరాలు:**

ఈ కాలంలో డిజిటల్ మాధ్యమాల ద్వారా ఉగాది వేడుకలను ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నారు. వీడియో కాల్స్, సోషల్ మీడియా లైవ్ స్ట్రీమింగ్ ద్వారా కుటుంబ సభ్యులు, మిత్రులతో పండుగ సంబరాలను పంచుకుంటున్నారు. ప్రత్యేకంగా వర్చువల్ ఉగాది ఉత్సవాలు, ఆన్‌లైన్ పంచాంగ శ్రవణం కూడా జరుగుతోంది.

పర్యావరణ పరిరక్షణలో ఉగాది పాత్ర:

కొన్ని సంస్థలు ఉగాది సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. ఇది ప్రకృతి సంరక్షణకు మార్గదర్శకంగా నిలుస్తోంది. పర్యావరణ ప్రియులు ఈ పండుగను మరింత ప్రకృతి అనుకూలంగా మార్చేలా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.

ఉగాది పండుగ నూతన సంవత్సరాన్ని స్వాగతించడమే కాకుండా, ప్రకృతి, సంస్కృతి, జీవన విధానాలను పరిరక్షించుకునే సంకేతం. వసంత ఋతువులో ప్రకృతి పునరుజ్జీవనానికి, మామిడి చెట్ల పూతకు, వేప చెట్ల పరిమళానికి, పచ్చని చిగుళ్ళకు ప్రతీకగా ఈ పండుగ నిలుస్తుంది. ఈ శ్రీవిశ్వావసు నామ సంవత్సరము తెలుగు ప్రజలందరికీ ఆనందాన్ని, ఆయురారోగ్యాలను అందించాలని కోరుకుంటూ....-



రచన: చప్ప గాంధీ,
మేరీల్యాండ్,యు.యస్.ఏ

# సంవత్సరానికి ఆది... ఉగాది



తెలుగు వారి ప్రియమైన పండుగ ఉగాది. అంటే సంవత్సరానికి ఆది, అంటే మొదటిది అని అర్థం. అలా కొత్త సంవత్సరం వచ్చిన నాడే మనం 'ఉగాది' అంటాం. ఈ నెల 30వ తేదీన "శ్రీ విశ్వావసు" నామ సంవత్సరంలోకి అడుగు పెడుతున్నాం. "విశ్వావసు" అంటే విశ్వానికి సంబంధించినది అని అర్థం. ఇది తెలుగు సంవత్సరాల పేర్లలో ఒకటి.

మొదట యుగాది అన్న పదం వాడుకలో ఉండేది. దానిలో 'య' కారం లోపించి ఉగాది అయింది. యుగ అనే పదానికి సంవత్సరం అన్న అర్థం చెప్పుకోవాలి. మరి కొందరు ఇది ఉగస్య ం ఆది = ఉగాది అయిందని అంటారు.

ఉగ అంటే నక్షత్రం. నక్షత్రాలు చలనం మొదలు పెట్టినప్పటి నుంచి అంటే సృష్టి ప్రారంభమైన కాలం యొక్క ఆది (మొదలు) కనుక మనం ఉగాది అని వ్యవహరిస్తున్నాం. గ్రామాల్లో ఈ ఉగాది సంరంభం గతంలో చాలా చక్కగా కన్పించేది. మామిడి పిందెలు, చెఱకు, పసుపు పూలు, చిగురుటాకులు అన్నీ కనుల పండుగ చేస్తాయి.

చంద్రుడు ఒక నక్షత్రం నుంచి మరొక నక్షత్రాన్ని చేసే సంచారాన్ని బట్టి తెలుగు నెలలు ఏర్పడ్డాయి. చైత్రం మొదలైన నెలలు నక్షత్రాల పేరుతో ఏర్పడ్డాయి. చైత్ర మాసారంభమే ఉగాది శాలివాహన శకం ప్రకారం తెలుగు సంవత్సరాలకు అరవైకి పైగా పేర్లు పెట్టారు. ఆ సంవత్సరాలు ఒకటి పూర్తయి మరొకటి ప్రారంభమయ్యే మొదటి రోజు ఉగాది. ఇది సంవత్సరానికి ఆది గాబట్టి ఉగాదిని 'సంవత్సరాది' అని కూడా అంటారు. మన రాష్ట్రంలో వాడుకలో ఉన్న చాంద్రమాన సంవత్సరం తొలి దినమైన చైత్ర శుద్ధ పాడ్యమి నాడు ఉగాది పండగ జరుపుకుంటారు. చైత్ర మాసం నుంచి కొత్త సంవత్సరం ప్రారంభమయ్యే ఈ సంప్రదాయాన్ని క్రీ.శ..5వ శతాబ్దిలో వరాహమిహిరుడు అనే మహా జ్యోతిష్య పండితుడు ప్రారంభించాడని పండితుల మాట. సంవత్సరానికి ఆరు రుతువులు గదా. అందులో అతిమనోహరమైనది. వసంత రుతువు. ఈ వసంత రుతువు ఉగాదితోనే ప్రారంభం అవుతుంది. పాత ఆకులు రాలి పోయి కొత్త చిగుళ్లు వేస్తాయి. మామిడి పిందెలు, వేప పువ్వులు కన్పిస్తాయి. మోళ్ళు సైతం చిగురిస్తాయి. ఉగాది పర్వదినం నాడు మన ప్రకృతి కొత్త అందాలు సంతరించుకుని కళకళలాడుతుం టుంది.

పూర్వ కాలంలో అయితే తొమ్మిది రోజులు 'వసంత నవరాత్రులు' లేదా వసంతోత్సవాలు జరిగేవి. పూర్వం రాజుల కాలంలో ఈ వసంతోత్సవా లకు ఎంతో ప్రాధాన్యత ఉండేది. అప్పుడు ఉగాది వెనకటి రోజును అంటే ఫాల్గుణ బహుళ అమావాస్యను కొత్త అమావాస్య గా పిలిచి గ్రామాలలో పూజలు చేసేవారు. ఈనాడు మనం ఉగాదినాడు తప్పకుండా చేయవలసిన కార్యక్రమాలు రెండు ఉన్నాయి. అవి వేపపువ్వ పచ్చడి తినడం - పంచాంగ శ్రవణం ఉగాది తర్వాత ఏరువాక ప్రారంభం అవుతుంది. మంచి ముహూర్తం చూసి రైతులు తొలి దుక్కు పూజలు చేసి హారతి ఇస్తారు. ట్రాక్టరు రావడంతో ఈ ఆచారం కూడా మరుగునపడిపోతోంది. దున్నడం మొదలుపెడతారు. అప్పుడు పులగం చేసి ఎడ్లకు పెట్టి, నాగలికి ఎడ్లను కట్టి వేపపచ్చడిని ఉగాది రోజు పరగడుపునే తింటారు. దీనిని ఉగాది పచ్చడి అనీ, ఉగాది పులుసు అని కూడా అంటారు. సంస్కృతంలో దీనిని నింబకు సుమభక్షణం అంటారు. వేపపువ్వు, చింతపండు, బెల్లం, నెయ్యి, ఉప్పు, కారంలతో ఉగాది పచ్చడి చేస్తే అది షడ్రుచుల పచ్చడి అవుతుంది. చింత పండుకు బదులుగా పుల్లటి మామిడి ముక్కలు వేస్తారు. ఈ పచ్చడి వింతరుచితో ఉంటుంది. ఉగాది పచ్చడి జీవితానికి అర్థం చెబుతుంది. తీపి సుఖ దుఃఖాలకి సంకేతం. పులుపు, కారం ఆవేశానికి గుర్తు, ఉగాది పచ్చడి తినడం వల్ల శరీరంలోని త్రిదోషాలు హరించుకుపోయి శరీర తత్వంలో మార్పు వస్తుందని, ఆరోగ్యం వృద్ధి చెందుతుందని ఆయుర్వేదం చెబుతోంది. అలాగే జీవితంలో కష్టసుఖాలు సహజంగా వస్తుంటాయని రెండింటినీ సమానంగా అనుభవించాలే ఉగాది పచ్చడిని తీపి చేదులు కలిపి సేవించడంలో అర్థమని పెద్దలు చెబుతారు.

మన పండగలు - మనం ఆచరించాల్సిన విధులు ఒక నిర్దుష్ట రూపంలో సూచించేది పంచాం. తిథి వార నక్షత్ర, యోగం, కరణం అనే అయిదు అంశాలు గల గ్రంథంగాబట్టి దానికి పంచాంగం అనే పేరు వచ్చింది. జ్యోతిష్య శాస్త్రానికి, ఖగోళశాస్త్రానికి సంబంధించిన పంచాంగశ్రవణం అంటే వినడంవల్ల, పంచాంగ పఠనం వల్ల పుణ్యం లభిస్తుందని నమ్ముతారు. అదీగాక - కొత్త సంవత్సరం పరిస్థితులు పంచాంగంలో వివరంగా ఉంటాయి. వర్షాలు, పంటలు గ్రహబలాలు, ఫలితాలు, రాజకీయ, వాణిజ్య విశేషాలు కూడా పంచాంగంలో ఉంటాయి. సూర్య, చంద్రగ్రహణాలు సంభవించే సమయాన్ని సూచిస్తారు. పుణ్యకార్యాలకు శుభఘడియలు, దుర్ముహూర్తాలు, మూఢం తదితర విషయాలన్నీ పంచాంగంలో ఉండడం వల్ల ప్రజలకు పంచాంగం పట్ల ఆసక్తి ఉంటుంది.

సంవత్సరాది నాడు అందరూ పంచాంగం చూసి తమ రాశిఫలితాలు తెలుసు కుంటారు. కొత్త సంవత్సరం విధి నిర్వహణ పూర్తిగా పంచ అంగాలపై ఆధారపడి ఉంటుంది. గనుక చాలా మంది పంచాంగ శ్రవణానికి ప్రాధాన్యత నిస్తారు. గ్రామాలలో సాయంత్రం ఆలయ ఆవరణలోగాని, ఊరి చావడి లేదా రచ్చబండ దగ్గర గాని పంచాంగ శ్రవణం ఏర్పాటు చేస్తారు. పురో హితులైన బ్రాహ్మణులు నూతన సంవత్సర వాతావరణ విశేషాలను రాశి ఫలాలను వివరిస్తారు. రానున్న సంవత్సరంలో సకల శుభాలను కలిగించమని భగవంతుడిని ప్రార్థిస్తారు. ఇప్పుడు టి.వి. ఛానల్సులో పంచాంగ పఠనం చేసి పండితులు సంవత్సర ఫలితాలను చెబుతున్నారు.

చాలా మంది కొత్త సంవత్సరంలో తాము చేయవలసిన పనులకు సాధించవలసిన లక్ష్యాలను నిర్ణయించుకుంటారు. శ్రీదేవి ఉపాసకులు ఉగాదినాడు దేవీపూజలు జరుపుతారు. ఉగాదిని చాలా ప్రాంతాల్లో 'వసంతపంచమి' శ్రీపంచమి' అని పిలుస్తారు. పూర్వం గ్రామాల్లో 'ఉగాది పండగ వచ్చింది - ఊరికి అందం తెచ్చింది. దేవుడి గుడిలో బాజాలు, బాజాలయ్యాక పూజలు ఊరేగింపులు జరిగాక - ఉత్సవాలు ముగిసాక - పంచాంగాలను చదివించి - మంచి చెడ్డలను విన్నాము" అని పాడుకునేవారట.

- యామిజాల జగదీశ్

# పాటించాల్సిన విధివిధానాలు



విశ్వావసునామ సంవత్సర ఉగాది నాడు పాటించవలసిన విధి విధానాలు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి మాటల్లో...

యుగాది నాడు చేయవలసిన పనులలో ముఖ్యమైనది పంచాంగ శ్రవణం.

పంచాంగం విన్నవారు, వినడానికి ఏర్పాట్లు చేసినవారు తరిస్తారు అని శాస్త్రం.

**యుగాది రోజున తప్పక చేయవలసిన పనులు:**

సూర్యోదయానికి ముందు లేచి నలుగుతో ఒళ్ళు అంతా వ్రాసుకుని అభ్యంగన స్నానం. ఇష్టదేవతారాధనతో పాటు తప్పక లక్ష్మీదేవి పూజ, శ్రీసూక్తం పారాయణం చేయడం లేక వినడం,

**రుద్రాభిషేకం.**

వేపపూతతో చేసిన షడ్రుచుల పచ్చడిని రుద్రుడికి లేదా విష్ణువుకి నైవేద్యంగా పెట్టి గురుదేవులను, నవగ్రహాలను స్మరించు కుంటూ ప్రసాదాన్ని స్వీకరించడం, ఆలయ దర్శనం,సూర్యుడు అస్తమించే లోపు పం చాంగశ్రవణం, అన్నదానం, గురుదర్శనం, గురుప్రదక్షిణ, వ్యాస భగవానుడి కథ వినడం, సంధ్యాసమయంలో లక్ష్మీదేవికి దీపారాధన లేదా దీప దర్శనం,గోప్రదక్షిణ మఱియు గోపూజ, పురాణశ్రవణం ,మత్స్య మరియు స్కాంద పురాణములు గురువులకి దానం ఇవ్వడం వంటివి అన్నీ చేయడం ఎంతో ఉత్తమం మరియు సకలశుభప్రదం.

నూతన సంవత్సరం కనుక తప్పక తలస్నానం చేయాలి.నూతన వస్త్రాలు తప్పక ధరించాలి. అలా కుదరని పక్షంలో, స్నానమాచరించిన తరువాత, కనీసం ఒక నూలుపోగునైనా తలపై ధరిస్తే సరిపోతుంది.

ఉగాది పచ్చడిని కాలపురుషునికి (శివుడు లేక కేశవుడు) నైవేద్యంగా పెట్టి ప్రసాదంగా స్వీకరించాలి.

ఉదయాన్నే దేవాలయమునకు వెళ్ళి దైవ దర్శనం చేసుకోవాలి. సాయంత్రం శక్తిమేర తప్పక దానములు ఇవ్వాలి.

మినపప్పు , కందిపప్పు, శెనగపప్పుతో చేసిన పదార్థాలు స్వీకరించాలి, స్వయం పాకంగా దానం ఇవ్వాలి.

రెండు ఆకులు వేసి గోధుమలు, కంది పప్పు, కనీసం కేజీ పావు కి పైగా బియ్యం, పాలు, పెరుగు, నెయ్యి ఇతరములు బ్రాహ్మణులకు దానము ఇవ్వాలి.

ఈ సంవత్సరం ఆదివారంతోనే ప్రారంభం అవుతుంది కనుక గోధుమలు, దానం ఇవ్వటం ద్వారా రవి ప్రీతిని పొందగలము.కుదిరితే అన్నదానం చేయాలి. జలదానం చేయాలి.

తల్లిదండ్రులకు భక్తితో నమస్కరించాలి, భార్యను ప్రేమతో చూచి కుదిరితే గాజులు కొనిచ్చి /కొనిపెట్టి , కుంకుమ బొట్టు పెట్టి ఆమెను దేవతగా భావించాలి. తద్వారా పార్వ తీదేవి యొక్క ఆశీస్సులు పొందగలము.

గురువునకు ఉగాదినాడు 3 ప్రదక్షిణలు చేసినవారు, 3 సార్లు భూప్రదక్షిణ చేసిన ఫలితం పొందుతారు.

లక్ష్మీదేవిని పూజించి మహాలక్ష్మీ మంత్రమును జపించుకోవటం, ఈశ్వరునికి అభిషేకం చేసుకోవటం శ్రేష్ఠం.

పంచాంగ శ్రవణం చేయండి, కుదిరితే పంచాంగం లేక మంచి పుస్తకాలు దానం చేయడం మరింత ఉత్తమం. ఆలా చేస్తే పిల్లల యొక్క విద్య వృద్ధి చెందుతుంది.

పసుపు కుంకుమలు దానం ఇవ్వండి.

బూరెలతో కూడిన భోజనము చేస్తే భూరి సంపదలు ఇస్తాడు పరమాత్మ.

ఉగాది వస్తోందంటే చాలు వేప పచ్చడీ, పంచాంగ శ్రవణమే గుర్తుకుస్తాయి. మరి ఉగాది అంటే ఇంతేనా! ఆ రోజు పూజించేందుకు ప్రత్యేకమైన దైవం కానీ, ఆచరించాల్సిన విధులు కానీ లేవా అంటే లేకేం...

చైత్రశుద్ధ పాడ్యమి రోజునే సృష్టి మొదలైందని పెద్దలు చెబుతారు. అందుకనే ఆ రోజుని యుగాది లేక ఉగాదిగా గుర్తిస్తారు. ప్రతి పండుగలానే ఇవాళ కూడా సూర్యోదయానికి ముందరే నిద్రలేచి తైలాభ్యంగన స్నానం చేయమని చెబుతారు. నువ్వులనూనెని ఒంటికి పట్టించి చేసే స్నానమే ఈ తైలాభ్యంగనం. ఏ రోజు కుదిరినా కుదరకపోయినా సంవత్సరానికి తొలిరోజైన ఉగాదినాడు తైలాభ్యంగనం చేసి తీరాలన్నది పెద్దల శాసనం. సంవత్సరపు ఆరంభాన్ని ఇలా శుచిగా, ఆరోగ్యంగా ప్రారంభించాలన్నది వారి అభిమతం.

అభ్యంగన స్నానం ముగిసిన తరువాత గడపకు పసుపు, కుంకుమలను అద్ది గుమ్మానికి మామిడి తోరణాలు కట్టాలి. ఇక ఉగాదిరోజున ఏ దైవాన్ని పూజించాలి అన్నది కూడా ఓ సందేహమే! ఉగాది రోజున కాలమే దైవం. కాబట్టి మనకు ఇష్టదైవాన్ని ఆ కాలపురుషునిగా తల్చుకుని పూజించుకోవాలి. స్థితికారుడైన విష్ణుమూర్తిని స్మరించినా, లయకారుడైన శివుని కొలిచినా, ప్రకృతికి చలనాన్ని అందించే అమ్మవారిని ధ్యానించినా సమ్మతమే!

ఇష్టదేవతల స్తోత్రాలని పఠించి పూజించిన తరువాత వారికి ఉగాది పచ్చడిని నివేదించాలి. పులుపు, తీపి, వగరు, చేదు, ఉప్పు, కారం అనే ఆరురుచుల కలయికగా ఉగాది పచ్చడిని రూపొందిస్తాము. వైద్యపరంగా ఈ ఉగాది పచ్చడి వేసవి వ్యాధుల నుంచి రక్షణను అందిస్తుంది. ఆధ్మాత్మికంగా చూస్తే జీవితం సుఖదుఖాల మిశ్రమం అని చెప్పడమే ఉద్దేశంగా కనిపిస్తుంది. ఒక పక్క జీవితం శుభాశుభాల మిశ్రమం అని గ్రహిస్తూనే రాబోయే రోజులకి సిద్ధపడాలనే సూచనని అందించేదే పంచాంగం. అందుకనే సంవత్సరపు మొదటిరోజైన ఉగాది నాడు పంచాంగం విని తీరాలంటారు పెద్దలు.

ఇక ఉగాది రోజున 'ప్రపాదానం' అంటే చలివేంద్రాన్ని పెట్టమన్నారు పెద్దలు. ఎండలు మొదలయ్యే ఈ సమయంలో చలివేంద్రంతో బాటసారుల దాహార్తిని నింపడమే వారి ఉద్దేశం. చలివేంద్రం స్థాపించే స్తోమత అందరికీ ఉండదు కాబట్టి ఒక నీటి కుండనైనా దానం చేయమని సూచిస్తున్నారు. ఎండలని తట్టుకుంటే నీరు ఇస్తే సరిపోదు కదా! అందుకని సూర్యుని తాపాన్ని ఎదుర్కొనేందుకు ఉగాదినాడు చెప్పులూ, గొడుగులు కూడా దానం చేయాలన్నది పెద్దల మాట. ఉగాది రోజున కొందరు ధర్మకుంభదానం పేరుతో నీరు నింపిన కలశాన్ని పెద్దలకు అందించాలని చెబుతారు.

ఉగాది ప్రత్యేకించి ఏ దైవానిదీ కాదు కాబట్టి, ఇంతకు ముందు ఎన్నడూ దర్శించని పుణ్యక్షేత్రానికి వెళ్లమని చెబుతారు. ఉగాది నూతన సంవత్సరానికి సూచన కాబట్టి కొత్త పనులను చేపట్టమని ప్రోత్సహిస్తారు. ఉగాది రోజున చేయవలసిన పనులు ఇన్ని ఉన్నాయన్నమాట.

# ఉగాది ప్రవచనం - సంవత్సరాది సందేశం.





చాంద్రమాన పంచాంగానుసారం ప్రతి సంవత్సరం చైత్ర శుద్ధ పాడ్యమి నాడు వచ్చే పండగ ఉగాది. తెలుగువారి మొదటి పండుగ. ప్రకృతిలోని మార్పుతో నిశ్శబ్దంగా మన ఇంట్లోకి వచ్చే పండగ .

హోరెత్తించే మైకులు నిషా తో ఖుషి గా చెప్పే శుభాకాంక్షలు, అర్ధరాత్రి వరకు పబ్బుల్లో క్లబ్బుల్లో డాన్సులు తెలిసిన వాళ్ళకి తెలియని వాళ్ళకి చెప్పే చరవాణి శుభాకాంక్షలు,ఇవేవీ లేవు ఆనందంగా నిశ్శబ్దంగా మన ఇంటికి వచ్చే పండగ తెలుగు సంవత్సరాది. సంస్కృతి సంప్రదాయం వెంటబెట్టుకుని మరీ వస్తుంది మన ఇంటికి.

పుడుతూనే పేరు పెట్టుకుని కోయిల సన్నాయి రాగం పలుకుతుంటే దారి పొడుగునా చెట్టుకొమ్మలన్నీ కొత్త చిగురు తొడిగి బాపు గారి బొమ్మల మెరిసిపోయి పిల్ల తిమ్మిర్లు వీస్తుంటే

చిటారు కొమ్మనున్న మిఠాయి పొట్లం పుటుక్కున తెంపి

పండగ ప్రసాదానికి పచ్చిమామిడి తెచ్చి ఇచ్చింది.

అవి ఆకాశంలో మెరిసిపోయే తారలు కాదు పూజకు పనికిరాని పువ్వులు అంటూ జీవితంలో చేదునిజాలు తెలిసినప్పుడు

తట్టుకునే గుండె ధైర్యాన్ని ఇచ్చింది.చింత చెట్టు మీద దయ్యం

ఉంటే నాకేం భయం ముందుకు సాగిపోవడమే జీవితం అని

జీవితానికి ఒక కొత్త రుచిని అలవాటు చేసింది.

జీవితమంటే ఒలిచిపెట్టిన అరటి పండు కాదు బెల్లం కొట్టిన రాయిలా కూడా ఉండదు జీవితాన్ని తీపిగా అనుభవించడ%శీ

%మన చేతుల్లోనూ చేతల్లోనూ ఉంది అంటూ చెప్పకనే చెబుతూ

గుండెల్లో ఎన్ని బాధలు ఉన్నా ఎప్పుడూ నిటారుగా ఉండి తీపిని పంచే చెరుకుని ముక్కలు చేసి తీపి జీవితంలో ఒక భాగం అనీ చెప్పింది.సంతోషానికి సంకేతం అని పండగ ప్రసాదానికి మరింత రుచి తెచ్చింది.

ఎప్పుడూ పరవళ్ళు తొక్కుతూ ఎగిసిపడే కెరటాలతో ఉత్సాహంగా ఉండే సాగరాన్ని చూసి ఉత్సాహానికి కారణం ఏమిటని ఆలోచించి దాని గుండెల్లో ఉండే కన్నీళ్లు మనకు ఉత్సాహం పెంచే ఉప్పు రాళ్ళని బదులు తెచ్చింది. ఎప్పుడు సుఖాలేనా కష్టాలు వచ్చినప్పుడు కదా జీవితం విలువ తెలుస్తుంది అంటూ పచ్చి మిర్చిని పచ్చడి చేసి కళ్ళ నీళ్లు తెప్పించింది.

జీవితం అంటే ఏమిటో చెప్పేసావు అన్ని రుచులు అక్షరాల చూపించావు.ఇంతకీ నీ పేరేమిటి అని అడిగితే నా పేరు

విశ్వా వసు. అరవై ఏళ్లకు మీ ఇంటికి వచ్చాను పేరులో ఏముంది పెన్నిధి. ఎవరి తలరాత వారిదే అని పంచాంగం విప్పి చెప్పింది.

ఆదాయం మన అదృష్టాన్ని బట్టి వ్యయం మనం చేతుల్లోనూ చేతల్లోనూ ఉంటుందని అంటూ చెప్పకనే చెప్పింది. మరి కష్ట సుఖాలు గురించి అమాయకంగా అడిగితే ఆ నదిని దాటాలంటే రెండు పడవలు తప్పనిసరి అంటూ తాత్వికంగా చెప్పింది.

ఇంకో ప్రశ్న నేను వేయకుండానే సమాధానం నవ్వుతూ చెప్పింది

నరంలేని నాలుక ఎవరిని ఎప్పుడు తిడుతుందో ఎప్పుడు పొగుడుతుందో ఎవరికి తెలుసు అదే రాజ్య పూజ్యం

తల దించుకునేలా చేసేది అవమానంఅంటూ జీవిత రహస్యం చెప్పేసింది. నా సందేహాలు అన్ని తీరిపోయేయి.పండగ పరమార్థం తెలిసిపోయింది.



రచన మధునా పంతుల
చిట్టి వెంకట సుబ్బారావు
కాకినాడ 9491792279

# ప్రతిష్టాత్మకంగా మోదకొండమ్మ జాతర




- మే 11,12,13 తేదీలలో ఉత్సవాల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు
- జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్

**పాడేరు(విశాఖ సమాచారమ్):**-అధికారులు, ఉత్సవ కమిటీ పరస్పర సహాయ సహకారాలతో శ్రీ మోదకొండమ్మ గిరిజన ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన శ్రీ మోదకొండమ్మ ఉత్సవాలపై మొదటి దఫా సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే నెల 11,12,13 తేదీలలో నిర్వహించ నున్న శ్రీ మోదకొండమ్మ ఉత్సవాలు విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, జిల్లా పేరు ప్రతిష్టలు పెంపొందించేందుకు ఉత్సవాలు వేదికగా నిలవాలని కోరారు. భక్తులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత, ఆధ్యాత్మిక వాతావరణ0లో ఉత్సవాలు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా భక్తుల మనోభావాలు దెబ్బ తినకుండా అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. అదేవిద0గా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేవ్పట్టాలన్నారు. శ్రీ మోదకొండమ్మ ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించడానికి, గతంలో గుర్తించిన లోపాలు అధిగమించడానికి వీలుగా వివిధ కోర్ కమిటీలను ఈ సందర్భంగా కలెక్టర్ ప్రకటించారు. కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులు ముందుగానే ఏ సమయంలో ఏ కార్యక్రమాలు నిర్వహించేది ఉత్సవాల కార్యక్రమాల షెడ్యుల్ ను ప్రకటించి ప్రచారం చేయడం ద్వారా ప్రజలు సమస్యలు లేకుండా ఆయా ఇష్టమైన కార్యక్రమాలో పాల్గొనుటకు అవకాశం ఉంటుందన్నారు. త్రాగు నీటి కమిటీ ముందుగానే ఎంత మంది సందర్శకులు వస్తారు, ఎక్కడెక్కడ మంచి నీటి అవసరం ఉండుంది అనేది గుర్తించి ఆయా ప్రాంతాలలో తాగు నీటి శిభిరాలు ఏర్పాటు చేయాలని, నీటిని అవసరమైన మేర సిద్ధం చేసుకోవాలన్నారు. శానిటేషన్ కమిటీ 24 గంటలు షిఫ్ట్ పద్ధతిలో ఆ మూడు రోజులు పని చేసేలా చర్యలు తీసుకోవాలని, ఎప్పటి చెత్త అప్పుడే తరలించాలని, రహదారులు, దేవాలయ పరిసరాలలో చెత్తను సమర్ధవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. హెల్త్ కమిటీ సభ్యులు మెడికల్ క్యాంపులు అవసరమైన ప్రాంతాలను గుర్తించి ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా అత్యవసర సమయాలలో అంబులెన్స్ మూవింగ్ ఏర్పాట్లు చూడాలని ఆదేశించారు. ట్రాన్స్ పోర్ట్ కమిటీ అవసరమైన ప్రత్యేక అదనపు బస్సులను గుర్తించి సిద్ధం చేసుకోవాలని, ఆయా బస్సుల రూట్లను, సమయాలను ముందుగానే ప్రచారం చేయాలని ఆదేశించారు. కల్చరల్ కమిటీ ఆధ్యాత్మిక కార్యక్రమాలుతో పాటు గిరిజన సంస్కృతి ప్రతిబింబించేలా కార్యక్రమాలు రూపొ0దించాలని, చుట్టుపక్కల ఐటిడిఎ ల కార్యక్రమాలు కూడా నిర్వహించేలా ఏర్పాటు చేయాలన్నారు. ప్రోటోకాల్ కమిటీ విఐపిల రాకను ముందుగానే తెలుసుకుని వారికి అవసరమైన ప్రోటోకాల్ చూడాలని, వారు రావలసిన సమయాన్ని తెలియజేయాలని ఆదేశించారు. అదేవిధంగా ఫుడ్ కమిటి, పబ్లిసిటీ కమిటీ, పవర్ సప్లయ్ కమిటీ, బందోబస్త్ కమిటీ, వెన్యు మేనేజ్మెంట్ కమిటీ, సెంట్రల్ కమాండ్ కంట్రోల్ కమిటీ తదితర కమిటీలను ప్రకటించారు. ఆయా కమిటీలు తీసుకున్న చర్యలపై తదుపరి సమావేశంలో సమీక్షించి తగు సూచనలు జారీ చేయడం జరుగుతుందన్నారు. ఎస్పీ అమిత్ బర్ధర్ మాట్లాడుతూ, క్రౌడ్ మేనేజ్మెంట్ లో సాంకేతికతను వినియోగించడం జరుగుతుందని, డ్రోన్లు, సిసి టివి కెమరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని, స్మార్ట్ చెక్ పోస్టులు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.స్థానిక శాసన సభ్యులు మరియు ఆలయ కమిటీ చైర్మన్ మత్స్యరాస విశ్వేశ్వర రాజు మాట్లాడుతూ, ఎక్కడా అశ్లీలతకు తావు లేకుండా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, భక్తులకు అసౌకర్యం కలగకుండా దర్శనం లభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉత్సవాలలో భాగంగా పట్టణమంతా విద్యుత్ దీపాలంకరణను ప్రభుత్వం తరుపున జిల్లా యంత్రాంగం చేపట్టాలని కోరారు. అదేవిధంగా సాంస్కృతిక కార్యక్రమాలు రాత్రి 11.00 గంటలకు ప్రారంభం అవుతాయని, వాటిని తెల్లవారు ఝూము 04.00 గంటల వరకు నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. మే రెండవ తేదీన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని సుమారు 65 టీములు పాల్గొంటాయని అందుకు సహకరించాలని కోరారు.మాజీ శాసన సభ్యులు గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ, 2014 నుండి శ్రీ మోదకొండమ్మ ఉత్సవాలను రాష్ట్ర పండగగా నిర్వహిస్తున్నామని, ఈ ఉత్సవాలకు నాలుగు రాష్ట్రాల నుండి లక్షలాది భక్తులు విచ్చేస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయలు మంజూరు చేస్తుందని, ఈ ఏడాది కూడా కోటి రూపాయలు మంజూరుకు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. పాడేరు పట్టణంలో వసతి సౌకర్యాలు లేవని, ఐనప్పటికీ ప్రతి ఇంటి నిండా బంధువులు ఉంటారని, వారికి ఇబ్బంది లేకుండా సాంస్కృతిక కార్యక్రమాలు తెల్లవారు ఝూము 04.00 గంటల వరకు నిర్వహించేలా అనుమతి ఇస్తే వసతి లేని ఇబ్బందిని అధిగమించ వచ్చని తెలిపారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, ఎఎస్పి ధీరజ్, డిఆర్ఓ కె. పద్మలత, స్థానిక సర్పంచ్ కె.ఉషారాణి, అన్ని విభాగాల జిల్లా అధికారులు, ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షులు పి. కృష్ణా రావు, కోశాధికారి ఎస్. రామకృష్ణ, సభ్యులు బి. వేంకట రమణ, కెజియా రాణి, కె. సురేష్ కుమార్, కె. ప్రశాంత్, వి. త్రినాద్, టి. మత్స్య కొండ బాబు తదితరులు పాల్గొన్నారు.

## బాలల న్యాయ మండలి సభ్యుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

### జిల్లా పర్యవేక్షణ అధికారి చంద్ర శేఖర్



**జి.మాడుగుల (విశాఖ సమాచారమ్) :** బాలల సంక్షేమము, సంస్కరణల సేవలు మరియు వీధి బాలల సంక్షేమ శాఖ వారు రక్షణ, ఆదరణ కరవైన పిల్లలు మరియు నేరారోపణ చేయబడిన పిల్లల కేసులను పరిష్కరించేందుకు గాను బాలల సంక్షేమ సమితి, బాలల న్యాయ మండలిలలో సభ్యులను నియమించుటకు అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యవేక్షణ అధికారి వై.చంద్ర శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. బాలల న్యాయ మండలి సభ్యుల నియామకం గురించిన పూర్తి సమాచారం,అర్హతల వివరాలు, దరఖాస్తుఫారం కొరకు %https://wdcw.ap. gov.in% అనే వెబ్ సైట్ నుంచి పొందవచ్చని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు సదరు వెబ్ సైట్ నుండి అప్లికేషన్ డౌన్లోడ్ చేసుకొని ఏప్రిల్ 9 వ తేదీ లోగా డైరెక్టరు, బాలల సంక్షేమము, సంస్కరణల సేవలు మరియు వీధి బాలల సంక్షేమ శాఖ, విజయవాడవారికి పంపవలసినదిగావారు కోరారు. ఇతర వివరాలకు చంద్ర శేఖర్, జిల్లా పర్యవేక్షణ అధికారి వారిని 9030 153369 నంబరులో సంపదించవచ్చున్నారు.

## ఆలోచింపజేసిన నాటికలు





**అనకాపల్లి(విశాఖ సమాచారమ్) :** అనకాపల్లి వివి.రమణ రైతు భారతిలో ఉగాది సందర్భంగా శ్రీమతి జ్యోతి సరళ స్మారక కళా పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు మూర్తి కల్చరల్ అసోసియేషన్ కాకినాడ వారిచే పెద్దలకు మాత్రమే నాటిక, అనంతరం కళానిలయం గుంటూరు వారి సహ ప్రయాణం నాటకలు ప్రదర్శించబడ్డాయి. ఆకెళ్ల రచించిన ఈ నాటికలు ప్రేక్షకులను ఆలోచింపజేశాయి.

**'సహ ప్రయాణం నాటిక నాటికి ఇతివృత్తం**

మహాదేవయ్య, పార్వతుల దంపతులు సనాతన ధర్మానికి, ఆచార సంప్రదాయాలకు, కళలకు వారసులు, మహదేవయ్య భార్య అనారోగ్యంతో జీవనం సాగిస్తూ ఉంటుంది. వారి ఊరిలోనే మృదంగ విద్వాన్ శరభయ్య ఈ కుటుంబానికి ఆప్తుడు. మహాదేవయ్య, శరభయ్యలు ఇద్దరూ ఆ ఊరి మేలుకోరి నగర సంకీర్తన చేస్తూ ప్రజలకు మంచి జరగాలని కోరుకుంటూ జీవనం సాగిస్తారు. మహాదేవయ్య కొడుకు శేఖరం పెద్ద అధికారి ఉద్యోగ రీత్యా పట్నంలో వుంటూ తల్లి దండ్రులను తన వద్దే వుండమని, ఈ ఆచార సంప్రదాయాలు వద్దని వారిస్తూ వుంటాడు. కానీ ప్రతిఏడు సంక్రాంతికి తమ స్వంత వూరికి వచ్చి నగర సంకీర్తన చేయటం, వేషాలు వేయడం, ఆనందంగా నాలుగు రోజులు గడపటంమహాదేవయ్య కుటుంబానికి ఆనవాయితి. ఈ సారి కొడుకు శేఖరం వద్దన్నా వినకుండా ఊరిలో అర్ధనారీశ్వరుడు వేషం వేయడం తో కొడుకు ఘర్షణ పడి కోపంతో భార్యని తీసుకొని పట్నం వెళ్ళిపోతాడు. పార్వతి కోరిక మేరకు మహాదేవయ్య అర్ధనారీశ్వర వేషంతో ఆనందతాండవం చేస్తూ వుంటే భార్య ఆనందం పారవశ్యంతో శివైక్యం చెందుతుంది. మహదేవయ్య అదిచూసి నిశ్చేష్టుడై బాధతో అసువులు బాస్తాడు. పట్నం వెళ్ళిన కొడుకు, కోడల్ని శరభయ్య తిరిగి ఇంటికి తీసుకొని రాగా కొడుకు ఈ సంఘటన చూసి వేదనతో తన తప్పు తెలుసుకొని తండ్రి ఆశయాలను స్వీకరించి అనుసరిస్తాడు.

పెద్దలకు మాత్రమే సాంఘిక నాటిక ఇతివృత్తం ఆనందరావు తన కుటుంబ సభ్యులు నీతిగా నిజాయితీగా జీవించాలని ఆశించే ఆదర్శమూర్తి ఆఫీసులో లంచాలు తీసుకునే కొడుకు శ్రీనివాస్, అనవసరంగా తన మనవడితో అబద్ధాలు చెప్పించే కోడలు మంగ, వీరికి సహకరిస్తున్న వియ్యంకుడు కోటయ్య ప్రవర్తనలో మార్పు తేవాలని ప్రయత్నించి చిన్నపిల్లలు పెంచడం అంటే ఒక బొమ్మను చెక్కి సమాజానికి అందించటం, ఉల్లి వంకరగా ఉంటే ఆ బొమ్మ చక్కగా రాదని తెలియజేసి వారిలో కనువిప్పు కలిగిస్తాడు మారిన కుటుంబం ఆనందరావుతో కలిసి ఆనందంగా ముందుకు నడుస్తారు, ఆనందంగా ప్రదర్శన ముగుస్తుంది.

రెండు నాటికలలోనూ పాత్రధా రులు పాత్రోచితంగా నటించి పాత్రలను మెప్పించారు. ప్రేక్షక ప్రశంసలు పొందారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ డీడీనాయుడికి సన్మానం



అనకాపల్లి (విశాఖ సమాచారమ్) : విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పట్టణంలో పేరుగాంచిన ప్రముఖ డాక్టర్ డాక్టర్ డి డి నాయుడు శనివారం అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యా దపూర్వకంగా కలిశారు. డాక్టర్ డి డి నాయుడుని ఎంపీ డాక్టర్ సీఎం రమేష్ శాలువా వేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

## నూకాలమ్మ ఆలయంలో మేయర్ ప్రత్యేక పూజలు



విశాఖపట్నం, విశాఖ సమాచారమ్ : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి నూకాలమ్మ పండుగ మహోత్సవం సందర్భంగా పాత ఆరిలోవలోని నూకాలమ్మ దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలను భక్తులకు అందించారు.ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ లోకమాత శ్రీ శ్రీ శ్రీ నూకాలమ్మ అమ్మవారి పండుగ సందర్భంగా అమ్మవారికి పూజలు చేశామని, నూకాలమ్మవారి ఆశీస్సులు నగర ప్రజలపై ఉండాలని అలాగే నగరాభివృద్ధి జరిగేటట్లు చూడాలని వేడుకున్నట్లు ఆమె తెలిపారు.

## పెదపూడిలో నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర



**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):** మండలంలోని ఎర్ర వాయి ప్రాంతంలో ఘన చరిత్ర కలిగిన పెదపూడి శ్రీ నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు అధ్యక్షతన గ్రామ పెద్దలు, నూకంభిక యూత్ సహాయ సహకారాలతో ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం చిడతలు వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఏర్పాటుచేసి భక్తులకు పులిహోర, మజ్జిగ వంటి తీర్థప్రసాదాలు అందజేసి అమ్మవారి జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ నీటి సంఘం అధ్యక్షులు ఉండా తాతారావు, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కురందాసు అప్పారావు నూకాంబిక యూత్ అధ్యక్షులు మహేష్, గ్రామ స్కూల్ కమిటీ చైర్మన్ రమణ తో పాటు పలువురు టిడిపి నాయకులు బలరామ కృష్ణ,రామకృష్ణ, శివ రామకృష్ణ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## అనకాపల్లి మైనింగ్‌లో నా ప్రమేయం లేదు

### ఎంపీ సీఎం రమేష్



**అనకాపల్లి, విశాఖ సమాచారమ్ :** అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో జరుగుతున్న మైనింగ్ లో నా ప్రమేయం ఏమీ లేదని అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ అన్నారు .స్థానిక బైపాస్ రోడ్ లోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ నాయకులు ఆరోపిస్తున్నట్లు ఎక్కడైనా మైంనిగ్ లో తన ప్రమేయం ఉన్నట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని బహిరంగ సవాల్ విసిరారు .వైసీపీ నాయకులు అమర్నాథ్ .ధర్మశ్రీ ఆ వాకులు చవాకులు పేలుతున్నారని అది అంతా అబద్ధమని చెప్పారు. మీడియా ఆధ్వర్యంలో ఎటువంటి చర్చకైనా సిద్ధమని ప్రకటించారు. అనకాపల్లిని అభివృద్ధి చేస్తుంటే చూడలేక ఓర్వలేక తనపై ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. అధికారులు కూడా ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా ఏ మైనింగ్ కార్యక్రమం జరిగిన చర్యలు చేపట్టాలని ఆదేశించడం జరిగిందన్నారు .విజిలెన్స్ ఎంక్వయిరీ చేపించాలని డిమాండ్ చేశారు .ఈ నెల 31న అచ్యుతాపురం అనకాపల్లి 100 అడుగుల రోడ్డు శంకుస్థాపన కార్యక్రమానికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హాజరుకానున్నారని తెలిపారు .పార్లమెంటు సమావేశాల్లో ఈ ప్రాంత సమస్యలపై చర్చించడం జరిగిందన్నారు .కేంద్రీయ మంజూర అయిందని తెలిపారు. ఈ ప్రాంతంలో ఉన్న పరిశ్రమల్లో ఉన్న రెండు ఏ ఉద్యోగాలకు 4 లక్షల ఉద్యోగాలు పెరిగేలా , చేపడుతున్నట్లు తెలిపారు. పార్లమెంట్లో అరకు కాఫీని పెట్టడం జరిగిందన్నారు .ఏది ఏమైనాప్పటికీ నియోజకవర్గ అభివృద్ధి తన లక్ష్యం అని సీఎం రమేష్ ప్రకటించారు .ఈ కార్యక్రమంలో ఎలమంచిలి సుందరపు విజయ్ కుమార్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేష్ పాల్గొన్నారు

## ఎమ్మెల్యే 'గంటా'తో భేటీ



**విశాఖపట్నం, విశాఖ సమాచారమ్ :** భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఆయన స్వగృహం వద్ద విశాఖ బీసీ వెల్ఫేర్, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి ఆధ్వర్యంలో బీసీ కార్పొరేషన్ లోన్స్ మరియు కుట్టు శిక్షణ తరగతులపై సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శెట్టిబలిజ వెల్ఫేర్ మరియు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అనసూరి మధుసూదనరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర వెల్ఫేర్ మరియు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లా రవికుమార్, బీసీ కార్పొరేషన్ స్టాఫ్ ఈ కార్యక్రమంలో పాల్గొని గౌరవ శాసనసభ సభ్యులకు నియోజకవర్గంలో అప్లికేషన్స్ ఎన్ని వచ్చాయి అనే విషయంపై చర్చించారు.

# ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

- జిల్లాలో 15 శాతం గ్రోత్ రేటు సాధించాలి
- వేసవిలో తాగునీటి ఎద్దడి రాకూడదు
- జిల్లా కలెక్టర్ ఎ.ఎస్ దినేష్ కుమార్




**పాడేరు, విశాఖ సమాచారమ్ :** ప్రజల సమస్యలు పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ హెచ్చరించారు. వినతులపై సక్రమంగా ఎండార్స్మెంట్ వేయాలని ఆదేశించారు. శుక్రవారం సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలో నిర్వహించిన ప్రజా సమస్యలు పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డి ఆర్ ఓ కె. పద్మలతతో కలిసి 115 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ద పెట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పి జి ఆర్ ఎస్ పై ప్రత్యేక దృష్టి పెడుతోందన్నారు. పిజి ఆర్ గురుంచి ప్రజల నుండి ప్రతికూల ప్రతి స్పందన వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని అన్నారు.సచివాలయం పరిధిలో

పరిష్కరించాలన్నారు. జిల్లాలో అభివృద్ధిలో 15 శాతం పురోగతి సాధించాలని చెప్పారు. 15 శాతం వృద్ధి సాధించడానికి ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. ప్రాధమిక

వేసవిలో తాగు నీటి సమస్యలు లేకుండా గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

**ఫిర్యాదులపై వినతులు**

పెదబయలు మండలం పోయిపల్లి పంచాయతీ అర్లాబు గ్రామస్తులు తన భూమిలో ఉన్న నీలగిరి తోటలు సరికి విక్రయించడానికి అనుమతులు మంజూరు చేయాలని జె. మత్స్యరాజు వినతి పత్రం సమర్పించారు. ముంచంగి పుట్టు మండలం జర్రెల పంచాయతీ కర్రిముకిపుట్టు నుండి చెరుపు వీధి వరకు రోడ్డు నిర్మించాలని అందజేసారు. వి. భీమలింగం దరఖాస్తును అరకు వ్యాలీ మండలం మాడగడ పంచాయతీ ??. హట్టగుడ గ్రామానికి చెందిన గొల్లోరి కమల ఇల్లు మంజూరు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. పాడేరు మండలం మినుములూరు సర్పంచ్ ఎల్. చిట్టమ్మ సల్ది గెడ్డ వంతెన, రోడ్డు పనులను పూర్తి చేయాలని వినతిపత్రం సమర్పించారు. పెదబయలు మండలం గోమంగి పంచాయతీ పంగళము, సంపంచగి బంద గ్రామస్తులు జి. మాణిక్యం, పి. గోపాల్, పి. బాలకృష్ణ తదితరులు పంగళం, సంపంగిబంధ గ్రామాలకు రోడ్డు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ డి సి లోకేష్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బి ఎస్ సంద్, జిల్లా ఉద్యాన వన అధికారి ఎ. రమేష్ కుమార్ రావు, గిరిజన సంక్షేమ శాఖ ఇ ఇలు కె. వేణుగోపాల్, జి. దేవిద్రాజు, ఉప సంచాలకులు ఎల్.రజని, రహదారులు భవనాల శాఖ ఇ ఇ బాల సుందరబాబు, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి పి. ఎస్. కుమార్, సర్వే సహాయ సంచాలకులు దేవేంద్రుడు

30 Vs 6.qxd 3/29/2025 7:42 PM Page 1



# ఘనంగా నూకాంబిక అమ్మవారి అంబలం పూజ



**అనకాపల్లి (విశాఖ సమాచారమ్) :** పట్టణంలో ప్రసిద్ధి చెందిన నూకాంబిక అమ్మవారి ఆలయంలో నూకంబిక అమ్మవారి మాల ధారుల సంఘం వ్యవస్థాపకులు పొలిమేర శ్రీను ఆధ్వర్యంలో అమ్మవారి జాతర సందర్భంగా ఆలయ ఆవరణలో శుక్రవారం రాత్రి అమ్మవారి భారీ అంబలం పూజ అత్యంత ఘనంగా నిర్వహించారు. పూజలో ప్రముఖ బిల్డర్లు కాండ్రేగుల నాయుడు, కాండ్రేగుల శ్రీరామ్ ,ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో. సూరిశెట్టి శ్రీను, బుద్ధ రాజా, మల్ల గణేష్, కె శ్రీను, బుద్ధ చిన్న, సూరిశెట్టి ఉదయ్, అక్షర పవన్ రాజా, మాల ధారణ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే టీడీపీ ధ్యేయం



**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):** తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం వడ్డాది, బంగారుమెట్టలో ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ తమరాన దాసు ఎంపీటీసీ, ఎలపు జగ్గారావు, మాజీ ఎంపీటీసీ దొండ శ్రీను, సాయం శేషు, మండల టిడిపి అధ్యక్షుడు జి కోటేశ్వరరావు, ఎంపీపీ డి.నాగేశ్వరీ దేవి, మాజీ ఎంపీపీ ఎంవీవీ సత్యనారాయణ, డైరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ డి. అప్పలనాయుడు, తదితరులు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా ఎల్లప్పుడూ పేద ప్రజల సంక్షేమం కోసమే టిడిపి పని చేస్తుందన్నారు. బడుగు బలహీన వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించిన పార్టీ టిడిపియే అన్నారు.ఏ ప్రాంతీయ పార్టీకి లేనన్ని సభ్యత్వాలు టిడిపికి ఉన్నాయన్నారు. అన్ని వర్గాలకు మేలు చేస్తున్న ఏకైక పార్టీ టిడిపి అన్నారు. చంద్రబాబు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా పనిచేస్తుందన్నారు. ఎస్.శ్రీనివాస్,తలారి శంకర్, గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు. అదే విధంగా మండలంలోని పలు గ్రామాల్లో పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

**అరకులోయ .....**

అరకులోయలో తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అరకు నియోజకవర్గ ఇంచార్జ్ మరియు ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సివేరి దోన్నుదొర ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి అనంతరం ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్లో తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1982లో పార్టీని స్థాపించి 9 నెలల కాలంలోనే అసెంబ్లీలో అడుగుపెట్టి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు జరిపి ప్రజలకు చేరువై ప్రజల కొరకు నిరంతరం శ్రమించే పార్టీ తెలుగుదేశం అని అన్నారు. రెండు రూపాయల బియ్యం పథకం పెట్టి ప్రజలకు ఇంకా చేరువైన పార్టీ తెలుగుదేశం పార్టీ ఒకటేనని ఆయన అన్నారు ఈ పార్టీ స్థాపించిన మహానుభావుడు ఇప్పటికీ ప్రజల గుండెల్లో ఉన్నాడని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పెట్టేలీ దాసుబాబు, తెలుగుదేశం పార్టీ మండల లక్ష్మి,చందు ,మహదేవ్, మరియు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మరిడిమాంబ

## భక్తిశ్రద్ధలతో మరిడిమాంబ ఆలయ వార్షికోత్సవం

**కె.కోటపాడు, (విశాఖ సమాచా రమ్):–** మండలంలోని మేజర్ పంచాయతీ చౌడువాడ గ్రామంలో వెలసిన మరిడిమాంబ బంగారమ్మ తల్లి దేవాలయ మూడవ వార్షికోత్స వం శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరి గింది. ఉదయం నుండి అమ్మవా ర్లకు గ్రామస్తులు పసుపు కొమ్ములు సమర్పించుకొని మొక్కులు చెల్లిం చుకున్నారు మధ్యాహ్నం అన్నదా నం జరిగింది సాయంకాలం జిల్లా జిల్లాస్థాయి గుర్రపు పరుగు పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ప్రేమించి మోసపోయిన యువతి అప్పగింత



**విశాఖపట్నం (విశాఖ సమాచారమ్):–** పార్వతీపురం, మన్యం జిల్లా కు చెందిన చెప్పల మయూరి (22),ఈమె విశాఖలో ఉన్న ఒక యువకుడిని ప్రేమించి తన కుటుంబసభ్యులతో గొడవ పడి వైజాగ్ వచ్చేసింది. ఈమె జగదాంబ వద్ద రోడ్ మీద ఒంటరిగా ఉండగా, మహారాణి పేట పోలీస్ వారు గమనించి, ఏయూటిడి సిబ్బందికి అప్పగించారు. ఈమెను జీవియంసి టి.యస్.ఆర్ మహిళా షెల్టర్ లో ఆశ్రయం కల్పించి, ఆమె దగ్గర ఉన్న మొబైల్ నెంబర్ తో కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో శుక్రవారం ఉదయం మయూరి అక్క జీవన రేఖ షెల్టర్ కి రావడంతో, మహారాణిపేట మహిళా కానిస్టేబుల్ జి.రమ్య, సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చి మయూరిని వారి అక్క కు క్షేమంగా అప్పగించడం జరిగింది అని తెలియజేశారు.

# అయ్యన్న విద్యా సంస్థల్లో ఉగాది ముందస్తు వేడుకలు



**కె.కోటపాడు, (విశాఖ సమాచారమ్):** అయ్యన్న విద్యా సంస్థలలో రాబోయే 'విశ్వావసు' నామ సంవత్సరం ముందస్తు ఉగాది వేడుకలను శుక్రవారం వారం తెలుగుదనం ఉట్టిపడేలా నిర్వహించారు. పాఠశాలలో ఉగాది వేడుక వేదికను విద్యార్థులు పచ్చటి మామిడాకుల తోరణాలు, పసుపురంగు పూల మాలలతో ఎంతో అందంగా ఆకర్షణీయంగా అలంకరణ చేశారు. స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు సాంప్రదాయ వస్త్రధారణలో ఉగాది వేడుకలో ఉత్సాహంగా పాల్గొని ఉగాది పండగ నిండుతనాన్ని ప్రతిబింబించారు .వేడుకలో భాగంగా విద్యార్థి పంచాంగ శ్రవణాన్ని తోటి విద్యార్థులు శ్రద్దా సక్తులతో ఆలకించారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక తదితర దక్షిణ భారత రాష్ట్రాలో హిందూ పంచాంగం ప్రకారం చేసే తొలి పండగ ఉగాది గురించి, ఈ పండగకు ప్రత్యేకమైన షడ్రుచుల ఉగాది పచ్చడి గురించి విద్యార్థినులు ఎంతో చక్కగా వివరించారు. విద్యార్థులకు ఉగాది పచ్చడిని అందచేశారు. ఈ వేడుకల్లో పాల్గొన్న విద్యా సంస్థల అయ్యన్న విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఖాశీం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు,తల్లి దండ్రులకు ఉగాది శుభాకాంక్షలు చెప్పారు.

# మండలంలో ఘనంగా తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవం



కొయ్యూరు (విశాఖ సమాచారమ్): పేద బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిశం కృషి చేసిన మహానీయుడు నందమూరి తారకరామారావు అని తెలుగుదేశం నేతలు అన్నారు. మండలంలో 43వ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆర్ కంటారం లో మాజీ జిసిసి చైర్మన్ తెలుగుదేశం పార్టీ నేత ఎం వి వి ప్రసాద్ ఆధ్వర్యంలో తెలుగుదేశం జెండా ఆవిష్కరించారు. అనంతరం వైయస్సార్ పార్టీ నుంచి 40 మంది కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ప్రసాద్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కొయ్యూరులో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి క్లస్టర్ ఇంచార్జ్ తోట దొరబాబు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొయ్యూరు సర్పంచ్ మా కాడ బాలరాజు,మేడిపోయిన సత్తిబాబు జిలకర శ్రీను, కూలిసెట్టి చందర్రావు,రాజేంద్రపాలెంలో మండల పార్టీ అధ్యక్షుడు గొలిసింగి సత్యనారాయణ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించి సీనియర్లకు సాలువ కప్పి సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ స్థాపించిన ఎన్టీఆర్ గురించి సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తల రక్షణగా ఎప్పుడు టిడిపి పార్టీఉంటుందని, చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి వైపు నడుస్తుంది అన్నారు. టిడిపి నేత లు కొర్రు రామ్మూర్తి, ఎలమంచిలి వరహాల బాబు, రాజేంద్రపాలెం సర్పంచ్ పీట సింహాచలం, కాకర గంగరాజు, మువ్వల రాజు, తోపాటు మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్రెబ్స్ అక్రమ లే ఆఫ్ ఎత్తివేయాలని డిమాండ్



**కసింకోట (విశాఖ సమాచారమ్):** మండలం లోని క్రెబ్స్ బయో కెమికల్స్ అండ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీ వారు ప్రకటించిన అక్రమ లే ఆఫ్ ను తక్షణమే ఎత్తివేయాలని క్రెబ్స్ వర్కర్స్ అండ్ స్టాఫ్ యూనియన్ (సిఐటియు అనుబంధం)కంపెనీ ఎదుట ధర్నా నిర్వహించి తమ నిరసనను తెలియజేశారు.ఈ సందర్భంగా కార్మిక యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఏ.వి. అప్పారావు,బాబురావు, కన్నబాబు,గౌరవ అధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ, సిఐటియు జిల్లా కార్యదర్శి శంకర్, ఉపాధ్యక్షులు జి. కోటేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారి ఉత్తర్వుల ప్రకారం లే ఆఫ్ ను ప్రకటిస్తున్నామని, పవర్ సప్లై కూడా ఆగిపోవడం వలన కంపెనీ నడిచే పరిస్థితి లేదని ఏప్రిల్ 1వ తేదీ నుండి లే ఆఫ్ ను ప్రకటిస్తున్నామని యాజమాన్యం వారు ప్రకటించడం చాలా అన్యాయమని కార్మికులందరూ తమ బాధను వ్యక్తం చేశారు.ఈ సంవత్సరం మార్చి నెలలో యాజమాన్యం వారికి మరియు కార్మిక యూనియన్ కి మధ్య జరిగిన వేతనాలు తదితర సంబంధించిన అగ్రిమెంట్ పూర్తవుతుందని,ఇటువంటి సమయంలో కంపెనీ వారు ప్రకటించిన అక్రమ లే ఆఫ్ వలన కార్మిక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని తమ విచారాన్ని వ్యక్తం చేశారు.క్రెబ్స్ యజమాన్యం వారు గతంలో కూడా ఇటువంటి అక్రమ లే ఆఫ్ ను చట్ట విరుద్ధంగా ప్రకటించారని కార్మికుల న్యాయబద్ధమైన పోరాటం వలన మరల కంపెనీని తెరిపించడం జరిగిందని అన్నారు.ఇప్పటికే పలుమార్లు కంపెనీ నుండి వస్తున్న పొల్యూషన్ పై చుట్టుపక్కల గ్రామాల వారు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న ఇప్పటివరకు పరిస్థితిని చక్కదిద్దలేదని అన్నారు. కంపెనీలో పని చేస్తున్న కార్మికులు చుట్టుపక్కల గ్రామాల వారు కూడా ఎక్కువగా ఉండటం వలన పొల్యూషన్ వలన వస్తున్న అనారోగ్యాలను, మహిళల గర్భ విచ్ఛిత్తి పరిస్థితులను ఎదుర్కొంటూ జీవనోపాధి కలుగుతుందని ఆశించి పనిచేస్తున్నారు.ఈ క్రెబ్స్ కంపెనీలో 332 మంది కార్మికులు, ఉద్యోగులు, టెక్నికల్ ఆపరేటర్స్, కెమిస్టు, ఎన్.ఎం.ఆర్ లు తదితరులు తమ పనులు సక్రమంగా నిర్వహిస్తున్నారు.అయితే కంపెనీలో పనిచేస్తున్న మొత్తం 332 మంది కి ఇవ్వకుండా కేవలం 73 మంది కార్మికులను మాత్రమే చూపించి అక్రమంగా లే ఆఫ్ ప్రకటించడం చట్ట విరుద్ధమైన చర్యని అన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, ఓ. అప్పారావు, జాజుల శ్రీనివాస్,నాగేశ్వరరావు, నూక నాయుడు, త్రినాధరావు తదితర కార్మికులందరూ పాల్గొన్నారు.

## ఘనంగా రాచకొండ బాల చెల్లమ్మ జాతర

**జి మాడుగుల( విశాఖ సమాచారం):–** జి మాడుగుల మండలం బోయతిలి మద్ది గరువు వెలసిన శ్రీ రాచకొండ బాల చెల్లమ్మ తల్లి జాతర ఘనముగా నిర్వహించారు. మొదటిరోజు శుక్రవారం నాడు అమ్మవారి ఘటాలను బొయితెలి గ్రామంలో కొలువు తీర్చగా శనివారం నాడు కొత్త అమావాస్య కావడంతో బోయ తిలి గ్రామం నుంచి పూజారి ఆధ్వర్యంలో అమ్మవారి ఘటాలతో రాచకొండ బాల చెల్లమ్మ తల్లి ఆలయం వరకు భారీ ఊరేగింపుతో వెళ్లి సమర్పించారు.. కార్యక్రమంలో ఆలయ పూజారి తో పాటు తమర్భా కొండాల రావు మత్స్య రాస పెంటం రాజు మాజీ సర్పంచులు టి రాంబాబు. కిడారి బీమ్ బాబు స్థానికులు భారీ స్థాయిలో ప్రజలు పాల్గొన్నారు. అలాగే పండగ సందర్భంగా అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.

## ఇండియన్ ఒలింపియాడ్‌లో జాతీయస్థాయి టాపర్స్

**కె.కోట పాడు,(విశాఖ సమాచారం):–** కే కోటపాడు మండల కేంద్రంలో గల అయ్యన్న స్కూల్ విద్యార్థులు ఐదుగురు ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ (ఐ.టి.ఒ.) 2024–25 రెండవ రౌండ్ (ఫైనల్) ఫలితాల్లో జాతీయ స్థాయి లో టాపర్స్ గా నిలిచారు. మాథ్స్ లో 1వ తరగతి విద్యార్థిని ఇమంది యజ్ఞ 15వ ర్యాంక్, 2వ తరగతి విద్యార్థిని సూరిశెట్టి లేఖనలక్ష్మి 12వ ర్యాంక్, 4వ తరగతి విద్యార్థిని వేమల మేఘన 5వ ర్యాంక్, 5వ తరగతి విద్యార్థిని బోలెంపూజిత 16వ ర్యాంక్ సాధించారు. అలాగే సైన్స్ లో 4వ తరగతి విద్యార్థి డొంక జ్ఞానసాద్విక్ 16వ ర్యాంక్ దక్కించుకున్నాడు. ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ లో నేషనల్ లెవెల్ లో టాపర్స్ గా నిలిచిన విజేత విద్యార్థులకు అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాశీం, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## వీఎంఆర్‌డీఏ పార్కుల్లో మౌలిక సదుపాయాలు



**విశాఖపట్నం, విశాఖ సమాచారమ్ :** వీఎంఆర్‌డీఏ పార్కుల్లో మౌలిక సదుపాయాలు, వాకర్లకు వసతులు కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ అన్నారు. శనివారం ఉదయం హెల్త్ ఏరినాలో నిర్వహించిన ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లా డుతూ ప్రతీ ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలని, అందుకు అనుగుణంగా వీఎంఆర్‌డీఏ పార్క్‌లు తీర్చిది ద్దుతున్నామన్నారు. అన్ని పార్కుల్లో ఆరు బయట వ్యాయామ పరికరాలు ఉంచుతామని తెలిపారు. అనంతరం హెల్త్ ఏరినా వాకర్ సంఘం ప్రతి నిధులతో వారికి అవసరమైన సదుపాయాలు కోసం చర్చించారు.

# బిజెపి శక్తి కేంద్రాల ప్రముఖులను నియమించాలి



**కె.కోటపాడు, (విశాఖ సమాచారమ్):–** మండలంలోని అన్ని పోలింగ్ బూత్ శక్తి కేంద్రాల ప్రముఖులను నియమించుకోవాలని మాడుగుల నియోజకవర్గ బిజెపి ఇన్చార్జి మేడపరెడ్డి శ్రీనివాస్ కోరారు. శుక్రవారం కే కోటపాడు మండల కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో మండల కార్యకర్తల సమావేశం జరిగింది. మండల బిజెపి అధ్యక్షురాలు పైల అమ్మాజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఏప్రిల్ ఆరో తేదీని పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఎండోమెంట్ పరిధిలోని దేవాలయ కమిటీలకు అర్హులైన ఆధ్యాత్మిక భావాలు కలిగిన వ్యక్తులను నియమించడానికి సరైన వ్యక్తులను ఎంపిక చేయాలని, బీసీ కార్పొరేషన్ రుణాలను అర్హులైన వారికి అందే విధంగా కార్యకర్తలు సహకారం అందించాలని శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బిజెపి నాయకులు వరి వెంకట్రావు పెరగడం సన్యాసినాయుడు బండారు సత్యనారాయణ పాత్రుడు దొగ్గ ఈశ్వర ప్రసాదు ఇమంది సన్యాసిరావు, సబ్బవరపు శివ పాల్గొన్నారు.

# నన్నయ్యలో ఉగాది వేడుకలు



**రాజమహేంద్రవరం , (విశాఖ సమాచారం):** ఉగాది పురస్కరించుకొని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీలో ఉగాది సంబ రాలు ఘనంగా జరిగాయి ఈ సందర్భంగా ఉగాది పురస్కారం ను నన్నయ్య యూనివర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్. ఎస్ ప్రసన్న శ్రీ చేతుల మీదుగా మాజీ ఉప కులపతి ప్రొఫెసర్ పసలపూడి జార్జ్ విక్టర్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రర్ ప్రొ. జి. సుధాకర్ , డీన్లు ప్రాన్సి పాళ్ళు, సిబ్బంది , విద్యార్థులు పాల్గొన్నారు.

# ఒకటో తేదీన పింఛన్లు




**అనకాపల్లి, (విశాఖ సమాచారం బ్యూరో):** జిల్లాలో 'పేదల సేవలో' భాగంగా ఒకటవ తేదీ ఉదయం 7 గంటలకు పింఛన్ల పంపిణీ ప్రారంభించి, మొదటి రోజునే శత శాతం పింఛన్లు పంపిణీకి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. పింఛన్లు, ఉపాధి హామీ తదితర అంశాలపై శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టరు కార్యాలయం నుండి జిల్లా అదికారులు, మండల అభివృద్ధి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పెన్షన్లు పంపిణీకి అవసరమైన డబ్బును బ్యాంకు సెలవుల దృష్ట్యా ముందుగానే బ్యాంకుల నుండి ముందుగానే తీసుకోవాలని, సంబంధిత మండల పోలీసుస్టేషనులో భద్రపరచాలని తెలిపారు. ఒకటవ తేది ఉదయం 7 గంటలనుండి పెన్షన్లు పంపిణీ మొదలు పెట్టాలని, ముఖ్యమంత్రి వారి సందేశం పెన్షనుదారులకు వినిపించాలని తెలిపారు. పెన్షను డబ్బులు పూర్తిగా లబ్ధిదారునికి అందించాలని పెన్షన్లు పంపిణీలో ఎటువంటి వసూళ్లకు, అవకతవకలకు పాల్పడిన తీవ్రచర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజాప్రతినిధులను భాగస్వామ్యులను చేయాలని తెలిపారు.ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన పనులన్నింటిని పూర్తిచేయాలని, జిల్లాలో మంజూరయిన ర్లోప నులనుపూర్తిచేసి ఉగాధి రోజున ప్రారంభించాలని తెలిపారు. వేసవి దృష్ట్యా పశువులకు తాగు నీటి సౌకర్యం కల్పించుటకు తొట్టెలు నిర్మించడం జరుగుతుందని వాటిని అత్యంత ఉపయోగం ఉండే స్థలాల్లో నిర్మించాలని అన్నారు. జిల్లాలో 3403 పంట వెంటనే గ్రౌండింగు చేయాలని, పూర్తిచేయాలని తెలిపారు. ప్రతి కుటుంబానికి నూరు పనిదినాలు, కనీసవేతనం వచ్చే విధంగా పనులు మంజూరు చేయాలని తెలిపారు. సాగునీటి పారుదల వసతులలో పూడిక తీత పనులు చేపట్టాలన్నారు.గ్రామ, వార్డు సచివాలయాల నుండి పిల్లలందరికీ జనన దృవపత్రాలు, ఆధార్ నమోదు చేయాలని తెలిపారు. పుట్టిన తేది నమోదు చేసిన వారికి జనన దృవపత్రాలు అందజేయాలని, పుట్టిన తేది నమోదు చేయని వారి చేత నమోదు చేయించుటకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జననదృవపత్రం గల ప్రతి బాలబాలికకు ఆదార్ నమోదు చేయించాలని తెలిపారు.ఈ సమావేశంలో కె.కె.ఆర్.సి. స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎస్.వి.ఎస్. సుబ్బ లక్ష్మి, జిల్లా గ్రామీణాభివృది సంస్థ ప్రోజెక్టు డెరెక్టరు కె. శచీదేవి, డుమా ప్రోజెక్టు

# శ్రీవిశ్వావసునామ సంవత్సర రాశిఫలితాలు..

## మేషం...

**ఆదాయం- 2 వ్యయం-14, రాజపూజ్యం- 5, అవమానం-7**

వీరికి ఏల్నాటి శని ప్రారంభమైంది. గురు, రాహు,కేతువుల సంచారం అనుకూలం. సమస్యలు ఎదుర్కొన్నా మొత్తానికి సుఖసంతోషాలతోనే గడుపుతారు. శని ప్రభావం వల్ల ఆదాయం కంటే ఖర్చులు పెరిగి సతమతం కాగలరు. అనవసర వివాదాలతో చిక్కుల్లో పడతారు, అప్రమత్తతో పాటు, మౌనం మంచిది. ఇక గురుడు మే 18వరకు గురుడు వృషభరాశిలో సంచార సమయంలో ఆర్థిక లాభాలు, ఆస్తులు కొనుగోలులో ముందడుగు వేస్తారు. సంతాన సౌఖ్యం వంటి ఫలితాలు పొందుతారు. ఇక రాహు, కేతువుల నుండి అనుకూల ఫలితాలే కనిపిస్తాయి.

ప్రధాన సమస్యల నుంచి బయటపడతారు. సోదరులు, బంధువుల నుంచి మీరు ఆశించినమేర సహకారం లభిస్తుంది. నిరుద్యోగులకు అనూహ్యంగా ఉద్యోగావకాశాలు లభిస్తాయి. కొన్ని వ్యవహారాలలో మీ నిర్ణయాలు ఎంతగానో ఉపయోగపడతాయి. సమాజంలో పేరుప్రతిష్ఠలు నిలుపుకుంటారు. ఆరోగ్య విషయంలో శ్రద్ధ చూపండి, ముఖ్యంగా ఉదరం, ఎముకల సంబంధిత రుగ్మతలు ఎదుర్కొంటారు. కుటుంబంలో వివాహాది శుభకార్యాలు నిర్వహిస్తారు. విద్యార్థులకు కొత్త ఆశలు చిగురించి ఉత్సాహంగా ముందుకు సాగుతారు. కొన్ని విద్యావకాశాలు సాధిస్తారు. ఇంటి నిర్మాణయత్నాలు కార్యరూపంలో పెడతారు. తరచూ తీర్థయాత్రలు చేస్తారు. శాస్త్ర, సాంకేతిక రంగాల వారికి పరిశోధనల్లో విజయాలు, కీర్తి దక్కుతుంది. వ్యాపారస్తులు ఊహించని విధంగా లాభాలు అందుకుంటారు. మధ్యలో కొన్ని అవాంతరాలు ఎదురైనా అధిగమిస్తారు. పెట్టుబడుల విషయంలోనూ వెనక్కితగ్గరు. ఉద్యోగస్తులు విధి నిర్వహణ కు అంకితమై సత్తా చాటుకుంటారు. ఉన్నత హోదాలలోని వారి మన్ననలు పొందుతారు. కొందరికి బదిలీలు ఉండవచ్చు. పారిశ్రామికవర్గాల కృషి ఫలిస్తుంది. కొత్త కంపెనీల ఏర్పాటులో కీలక పాత్ర పోషిస్తారు. రాజకీయవర్గాలకు ఉన్నత పదవీయోగం. కళాకారులు చేజారిన అవకాశాలు దక్కించుకుంటారు. వ్యవసాయదారులకు తగినంత పెట్టుబడులు సమకూరతాయి. మే-అక్టోబర్ మధ్యకాలం, నవంబర్ నుండి సంవత్సరాంతం వరకు సామాన్యంగానే గడుస్తుంది. వీరు శనైశ్చరునికి తైలాభిషేకాలు, ఆంజనేయ స్వామికి అర్చనలు, దుర్గాస్తోత్రాల పఠనం చేయడం ఉత్తమం.

## వృషభం...

ఆదాయం- 11, వ్యయం-5, రాజపూజ్యం-1 అవమానం-3 వీరికి శని,గురుల సంచారం విశేషంగా కలిసివస్తుంది. అలాగే, రాహువు కూడా కొంతమేర శుభాలనిస్తాడు. వీరికి ఆదాయం తగినంత లభించి ఉత్సాహం, ఉల్లాసంగా గడుపుతారు. ఖర్చులను అదుపులో ఉంచుకుని పొదుపు చర్యలు పాటిస్తారు. సమాజంలో గౌరవానికి లోటు రాదు. అయితే కుటుంబంలో కొంత వ్యతిరేకత రావచ్చు. అలాగే, మనశ్శాంతి లోపిస్తుంది. మొత్తానికి వీరికి అన్ని విధాలా గతం కంటే శుభఫలితాలు ఎక్కువగా ఉంటాయి. బంధువుల ద్వారా సంపూర్ణ సాయం అందుతుంది. వివాహాది శుభకార్యాల సందడితో సంతోషంగా గడుపుతారు. వాహనాలు నడిపేవారు జాగ్రత్తలు పాటించడం మంచిది. కొన్ని ముఖ్య వ్యవహారాలలో విజయం సాధిస్తారు. కొన్ని సంఘటనలు ఆకట్టుకుటాయి. శాస్త్ర, సాంకేతికరంగాల విదేశీ ఆహ్వానాలు అంది పర్యటనలు చేస్తారు. విద్యార్థులు, నిరుద్యోగుల కృషి మొత్తానికి ఫలిస్తుంది. ఇంటి నిర్మాణాలు చేపడతారు. వ్యాపారస్తులు పెటుబడులను మరింత సమీకరించి విస్తరణ కార్యక్రమాలు చేపడతారు. అలాగే, లాభాలు అందుతాయి. ఉద్యోగవర్గాలకు విధుల్లో ప్రోత్సాహకరంగా ఉంటుంది. మే-అక్టోబర్ మధ్య మార్పులు జరిగే వీలుంది. పారిశ్రామిక, రాజకీయవర్గాల చిరకాల ఆశలు ఫలిస్తాయి. దీర్ఘకాలిక సమస్యలు తీరతాయి. కళాకారులకు శ్రమ ఫలించి ఊహించని అవకాశాలు అందుకుంటారు. ఏడాది మధ్యలో ఘనవిజయాలు చూస్తారు. వ్యవసాయదారులకు రెండు పంటలూ సానుకూలం. అక్టోబర్, నవంబర్, జనవరి నెలల్లో కొన్ని సమస్యలు రావచ్చు. ముఖ్యంగా ఆరోగ్యపరంగా చికాకులు, ధనవ్యయం, మానసిక ఆందోళన వంటి ఫలితాలు ఉంటాయి.

వీరు కేతువుకు పరిహారాలు చేయించుకుంటే మంచిది. అలాగే, విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

## మిథునం....

**ఆదాయం-14 వ్యయం-2, రాజపూజ్యం-4, అవమానం-3.**

వీరికి మే 15 నుండి గురుడు రాణిస్తాడు. అలాగే, శని, రాహుకేతువులు మిశ్రమ ఫలితాలు ఇస్తారు. ఆదాయంతో పాటు, సమాజంలో కీర్తిప్రతిష్ఠలు పెరుగుతాయి. కొంత అదనపు ఖర్చులు కూడా తట్టుకోవలసి వస్తుంది. బంధువర్గం నుంచి సాయంతో పాటు విమర్శలు, ఒత్తిడులు కూడా పెరుగుతాయి. పరిచయాలు మరింత విస్తృతం కాగలవు. మిత్రుల సహకారం ఎంతగానో ఉంటుంది. ఆర్థిక విషయాలలో హామీలు ఇవ్వడం మంచిది కాదు. కుటుంబంలో మనస్పర్థలు, వివాదాలు మధ్యలో కొంత ఇబ్బంది కలిగిస్తాయి. అయినా మనోనిబ్బరంతో ప్రతి విషయంలోనూ ముందడుగు వేస్తారు. ఆరోగ్యపరమైన సమస్యలు సైతం చికాకు పరుస్తాయి. ముఖ్యంగా నరాలు, చర్మ సంబంధిత రుగ్మతలు బాధించవచ్చు. జీవిత భాగస్వామి ద్వారా ధన లేదా ఆస్తి లాభం



కలుగుతుంది. వారసత్వ ఆస్తి పొందే వీలుంది. గృహ నిర్మాణయత్నాలు క్రమేపీ వేగవంతంగా సాగుతాయి. వివాహాది శుభకార్యాల నిర్వహణలో భాగస్వాములవుతారు.

తరచూ తీర్థయాత్రలు చేస్తారు. వాణిజ్య, వ్యాపారాలలో లాభాలకు లోటు రాకపోయినా కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఉద్యోగస్తులకు పనిఒత్తిడులు తగ్గి సత్తా చాటుకునే సమయం. ద్వితీయార్థంలో పదోన్నతులకు అవకాశముంది. పారిశ్రామిక వర్గాలకు విరివిగా విదేశీ పర్యటనలు, కొత్త పరిశ్రమల ఏర్పాటుకు సమాయత్తం కాగలరు. రాజకీయవర్గాల వారు కొత్త నిర్ణయాలు తీసుకుని భవిష్యత్తుకు మార్గం వేసుకుంటారు. కళాకారులకు అవకాశాలు మరింతగా దక్కించుకుంటారు. విద్యార్థులకు మంచి ఫలితాలు. వ్యవసాయదారులకు పెట్టుబడులు సమకూరతాయి. ఏప్రిల్, జూలై, నవంబర్ నెలలు సాదాసీదాగా ఉంటుంది. ఆంజనేయ స్వామికి అర్చనలు చేయడం ఉత్తమం. అలాగే, విష్ణుధ్యానం మంచిది.

## కర్కాటకం...

**ఆదాయం-8, వ్యయం-2, రాజపూజ్యం-7, అవమానం-3.**

మే 14వరకు గురుడు విశేషమైన ఫలితాలు ఇస్తాడు. తదుపరి అక్టోబర్ 18 వరకు గురుని వ్యయరాశి సంచారం వల్ల ఖర్చులు పెరుగుతాయి. సంపాదన అవసరం లేని వాటికి ఖర్చు చేయాల్సిన పరిస్థితి, అక్టోబర్ 18-నవంబర్ 11 మధ్యకాలం గురుడు కర్కాటరాశిలో సంచారం శుభకరం. ఇది గురునికి ఉచ్ఛస్థితి కావడంతో పట్టింది బంగారమే అన్నట్లు ఉంటుంది. కలిసివచ్చే అంశం. గత రెండున్నరేళ్లుగా ఇబ్బందులు పెట్టిన అష్టమ శని దోషం తొలగినా మే 19 నుండి అష్టమ రాహువు, కుటుంబస్థానంలో కేతు సంచారం ప్రతికూలం.

మొత్తానికి ఈ ఏడాది మిశ్రమ ఫలితాలు ఉంటాయి. రాబడి ఉన్నా ఖర్చులు కూడా అదే స్థాయిలో ఉంటాయి. చేపట్టిన వ్యవహారాలు నెమ్మదిస్తాయి. ఎంతగా కష్టించినా ఫలితం ఆశించిన స్థాయిలో ఉండదు. అప్పుల ద్వారా వివిధ విషయాలపై ఒత్తిడులు ఎదుర్కొంటారు. కుటుంబపరంగా కొన్ని సమస్యలు ఎదురుకావచ్చు. జీవిత భాగస్వామితో విభేదిస్తారు. సంతానపరంగా కూడా కొన్ని ఇబ్బందులు ఏర్పడతాయి. ఇంటి నిర్మాణయత్నాలు అక్టోబర్- నవంబర్ నెలల్లో సానుకూలమవుతాయి. అష్టమ రాహు దోషం వల్ల వాహనాల విషయంలో అప్రమత్తత అవసరం. వివాదాలకు దూరంగా ఉండడం మంచిది. అలాగే ఉదర, ఎముకలకు సంబంధించిన రుగ్మతలు ఇబ్బంది కలిగిస్తాయి. ప్రథమార్థంలో బంధువుల రాకతో కుటుంబంలో సందడి వాతావరణం నెలకొంటుంది. నిరుద్యోగులకు ఉద్యోగయత్నాలు ఫలిస్తాయి. గృహంలో శుభకార్యాల హడావిడి ఉంటుంది. ఆస్తుల తగాదాలు నేర్పుగా పరిష్కరించుకుంటారు. కోర్టు కేసులు కొన్ని విజయం సాధిస్తారు. వాణిజ్య, వ్యాపారాలలో లాభాలు అందుతాయి. ఊహించని భాగస్వాములు జతకడతారు. ఉద్యోగులకు ఆకస్మిక బదిలీలు. కొత్త బాధ్యతలు మీదపడి సతమతం కాగలరు. పారిశ్రామికవర్గాలకు అనుకున్న కార్యాలలో అడ్డంకులు కొంత తొలగుతాయి. రాజకీయవర్గాల వారికి మిశ్రమంగా ఉంటుంది. కళాకారులు అనుకున్నది సాధించినా కొంత కష్టపడాలి. విద్యార్థుల కృషి ఫలిస్తుంది. అయితే విదేశీ విద్యావకాశాల యత్నాలు నెమ్మదిగా సాగుతాయి. వ్యవసాయదారులలో కొత్త ఆశలు చిగురిస్తాయి. గురు, రాహు, కేతువులకు పరిహారాలు చేయడం మంచిది.

## సింహం...

**ఆదాయం-11, వ్యయం-11, రాజపూజ్యం-3, అవమానం-6**

వీరికి అక్టోబర్ 18 నుండి నవంబర్ 11 మధ్య గురుడు కర్కాటకరాశిలో సంచారం మినహా, మిగతా కాలమంతా శుభదాయకుడే. ఇక అష్టమ శని సంచారం ప్రభావం చూపుతుంది. అలాగే, జన్మ రాశిలో కేతువు, సప్తమంలో రాహువు కూడా మిశ్రమంగా ఫలితాలు ఇస్తారు. గురుని ప్రభావంతో ఆదాయం సమకూరినా శని ప్రభావం వల్ల వృథా ఖర్చులు వచ్చిపడతాయి. కుటుంబంలో కలహాలు, మానసిక సంఘర్షణ మధ్య గడుపుతారు. అయితే గురుబలం వల్ల కొంత గట్టెక్కుతారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలపై అధికంగా దృష్టి సారిస్తారు. సప్తమ రాహువు కారణంగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు నెలకొనవచ్చు. కొంత సంయమనం పాటిస్తూ ముందుకు సాగడం ఉత్తమం. అలాగే, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెడుతూ, సమయానుసారం ఆహారవిహారాదులు పూర్తి చేయడం మంచిది. అత్యవసర పరిస్థితుల్లో నమ్ముకున్న వ్యక్తులే ముఖం చాటేసే అవకాశం ఉంది. సమాజంలో విశేష గౌరవం పొందుతారు. అయితే కుటుంబంలో మాత్రం వ్యతిరేకత కనిపిస్తుంది. వివాహయత్నాలు సఫలమవుతాయి. ముఖ్య వ్యవహారాలు కొంత ఆలస్యంగా పూర్తి కాగలవు. వాహనాలు, కొత్త ఇల్లు కొనుగోలు చేస్తారు. కోర్టు వ్యవహారాలు నలుగుతూనే ఉంటాయి. వ్యాపార, వాణిజ్యరంగాల వారికి పెట్టుబడులకు ఇబ్బంది ఉండదు. అయితే సరైన ఆదాయం సమకూరక ఆందోళన చెందుతారు. ఉద్యోగులకు ఆకస్మిక మార్పులు ఉండవచ్చు. శాస్త్ర,సాంకేతిక రంగాల వారికి మంచి గుర్తింపు లభించే కాలం. పారిశ్రామికవర్గాలకు తరచూ విదేశీ పర్యటనలు చేస్తారు. రాజకీయవర్గాలకు ఒక పిలుపు ఊరటనిస్తుంది. కళాకారులకు కొత్త అవకాశాలు ఉత్సాహాన్నిస్తాయి. విద్యార్థులు శ్రమానంతరం ఫలితాలు సాధిస్తారు. వ్యవసాయదారులకు రెండవ పంట లాభిస్తుంది. అక్టోబర్- నవంబర్ మధ్య అన్నింటా మరింత అప్రమత్తతో మెలగాలి. శనికి పరిహారాలు చేయించుకోవాలి.

**నృసింహస్తోత్రాలు పఠించండి.**

## కన్య..

**ఆదాయం-14, వ్యయం-2, రాజపూజ్యం-6, అవమానం-6.**

వీరు గురుబలంతో ముందుకు సాగుతారు. సప్తమంలో శని కొంత ప్రతికూలం కాగా, రాహుకేతువుల ప్రభావం మిశ్రమంగా ఉంటుంది. మొత్తానికి వీరు ఎదురులేని కాలమనే చెప్పాలి. ఆర్థిక విషయాలలో ఎనలేని ప్రగతి సాధిస్తారు. ఆశలు వదులుకున్న ధనం కూడా అందుతుంది. కోర్టు వ్యవహారాలలో మీకు అనుకూల తీర్పులు రావచ్చు. మీ ఆలోచనలు కుటుంబసభ్యులు ఆచరిస్తారు. కొన్ని సమస్యలు తీరి మానసిక ప్రశాంతత చేకూరుతుంది. ఆస్తులు కొనుగోలుకు సమాయత్తమవుతారు. సంవత్సరం మ్యధ్యలో గృహయోగం, వివాహాది శుభకార్యాల నిర్వహణ వంటి వాటికి ఖర్చు చేస్తారు. నిరుద్యోగులకు ఉద్యోగలాభం. విద్యార్థులు మంచి ర్యాంకులు సాధిస్తారు. వ్యాపార, వాణిజ్యరంగాల వారికి ఇతోధికంగా లాభాలు రాగలవు. అలాగే, భాగస్వాములతో వివాదాలు తీరతాయి. ఉద్యోగులకు ఉన్నత హోదాలు రావచ్చు. పారిశ్రామికవర్గాల కృషి ఎట్టకేలకు ఫలించి నూతన ప్రాజెక్టులు చేపడతారు. ఐటీ నిపుణులకు చెప్పుకోతగిన మార్పులు ఉంటాయి. రాజకీయవేత్తలకు పదవులు, సన్మానయోగాలు కలుగుతాయి. కళాకారులు అవకాశాలతో ఉక్కిరిబిక్కిరి కాగలరు. వ్యవసాయదారుల ఆశలు నెరవేరతాయి. అయితే సప్తమ శని, వ్యయంలో కేతువు ప్రభావం వల్ల చర్మ, నరాలు, జ్వర సంబంధిత రుగ్మతలు బాధించవచ్చు. జీవిత భాగస్వామితో కొన్ని విభేదాలు నెలకొంటాయి. తొందరపాటు మాటలు లేకుండా, ఆచితూచి వ్యవహరిస్తూ సాగడం మంచిది. మే 18వరకు ప్రయాణాలు, ఇతర ముఖ్య వ్యవహారాలలో మరింత జాగ్రత్తలు పాటించాలి. మిగతా నెలలు అనుకూలమే. శని, కేతువులకు పరిహారాలు చేయించుకోవాలి.

**శ్రీదత్తాత్రేయ స్వామి స్తోత్రాలు పఠించండి.**

## తుల...

**ఆదాయం-11, వ్యయం-5, రాజపూజ్యం-2, అవమానం-2**

మే 14 నుండి అష్టమ గురుదోషం తొలగిపోనుంది. ఇక అంతా మంచిరోజులే. ప్రధానంగాగురు, శని అనుకూల సంచారం శుభకరం. రాహు, కేతువులు సామాన్య ఫలితాలు ఇస్తారు. మొత్తానికి గతం కంటే అద్భుతమైన ఫలితాలు చూస్తారు. ముఖ్యంగా ఆర్థికంగా పరిపుష్టి సాధిస్తారు. ఇతరుల వద్ద నిలిచిపోయిన ధనం చేతికందుతుంది. స్థిరాస్తులు సైతం సమకూరతాయి. ముఖ్యంగా తండ్రి ద్వారా రావలసిన ఆస్తులు దక్కవచ్చు. కుటుంబంలోనూ ప్రశాంతత చేకూరుతుంది. గతకొంత కాలంగా భార్యాభర్తల మధ్య నెలకొన్న మనస్పర్థలు తొలగి సమన్వయంతో ముందుకు సాగుతారు. సంతాన విషయంలో మీ అంచనాలు నిజం కాగలవు. శత్రువులుగా మారిన బంధువులు కొందరు తప్పిదాన్ని తెలుసుకుంటారు. వివాహాది శుభకార్యాలకు డబ్బు వెచ్చిస్తారు. కొన్ని సమస్యలు తీరి ఊరట చెందుతారు. సమాజంలో కీర్తిప్రతిష్ఠలు పొందుతారు. వాహన, గృహయోగాలు కలుగుతాయి. కాంట్రాక్టర్లకు ఊహించని టెండర్లు దక్కవచ్చు. తరచూ తీర్థయాత్రలు చేస్తారు. వాణిజ్య, వ్యాపారాలు లాభాలదిశగా సాగుతాయి. కొత్త పెట్టుబడులకు సైతం అనుకూలం. ఉద్యోగస్తులకు పైస్థాయి వారి కీలక సలహాలు అందుతాయి. కొందరికి పదోన్నతులు సంభవం. పారిశ్రామిక వర్గాలకు చిక్కులు తొలగి ప్రోత్సాహకరంగా ఉంటుంది. రాజకీయ నాయకుల ఆశయాలు ఫలించే శుభకాలం. విద్యార్థులు మంచి ర్యాంకులు సాధిస్తారు. వ్యవసాయదారులకు నూతనోత్సాహం. శాస్త్రసాంకేతిక రంగాల వారు పరిశోధనల్లో విజయాలు సాధిస్తారు. మే వరకూ ఆరోగ్య, కుటుంబసమస్యలు. వృథా ఖర్చులు ఎదురవుతాయి. వివాదాలకు దూరంగా ఉండండి. ఈకాలంలో గురునికి పరిహారాలు చేయించుకోవాలి. జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం మంచిది. వీరు ఆంజనేయ దండకం పఠించడం ఉత్తమం.

## వృశ్చికం...

**ఆదాయం-2, వ్యయం-14, రాజపూజ్యం-5, అవమానం-2**

వీరికి గురు, రాహువుల ప్రతికూల సంచారం పరీక్షాకాలంగా ఉంటుంది. మే 14 నుండి అక్టోబర్ 18వరకు, తిరిగి నవంబర్ 11 నుండి అష్టమ గురు దోషం. అలాగే, మే 19 నుండి సంవత్సరమంతా అర్థాష్టమ రాహు దోషం ఇబ్బందులు కల్పించవచ్చు. ఆర్థికంగా ఇబ్బందులు లేకున్నా ఖర్చులు అధికమై సతమతం కాగలరు. నిరుద్యోగులకు వచ్చిన అవకాశాలు సైతం చేజారి నిరాశ చెందుతారు. శుభకార్యాల రీత్యా ఖర్చులు చేస్తారు. మీ మాటకు కుటుంబంలోనే వ్యతిరేకత రావచ్చు. ప్రతి వ్యవహారాన్ని ఒకటికి రెండుసార్లు ఆలోచించడం మంచిది. ఏ నిర్ణయమైనా అప్తుల సలహా మేరకు తీసుకోవడం ఉత్తమం. మిత్రులు, సన్నిహితులతో అకారణంగా వైరం. వాహనాలు, భూములు కొనాలన్న ఆలోచన కలిగి ఆదిశగా అడుగులు వేస్తారు. అయితే కష్టసాధ్యమైనా ప్రయత్నం ఫలిస్తుంది. ఇంతకాలం మీరే సాయం అందించగా, ప్రస్తుతం వెనుకడుగు వేయాల్సిన పరిస్థితి. చిత్రవిచిత్రమైన సంఘటనలు ఎదురై ఆశ్చర్యపడతారు. అక్టోబర్-నవంబర్ మధ్య గురుబలం వల్ల ఆకస్మిక ధనలబ్ధి. మానసిక ప్రశాంతత, పరిపూర్ణ ఆరోగ్యం సమకూరతాయి. శాస్త్రసాంకేతిక రంగాల వారుతమ ప్రతిభను చాటుకుంటారు. వ్యాపారాలలో లాభనష్టాలు సమస్థాయిలో ఉండవచ్చు. ఉద్యోగస్తులకు విధుల్లో కొన్ని అవాంతరాలు వచ్చిన అధిగమిస్తారు. కొన్ని బదిలీలు నిలిచిపోయే అవకాశం ఉంది. పారిశ్రామికవర్గాలకు విదేశీ పర్యటనలు, కొత్త సంస్థలకు అనుమతుల కోసం యత్నిస్తారు. రాజకీయ వర్గాలకు సరైన గుర్తింపు దక్కవచ్చు. కళాకారులకు అనుకోని అవకాశాలు కొంత ఊరటనిస్తాయి. విద్యార్థుల యత్నాలు శ్రమానంతరం ఫలిస్తాయి. వ్యవసాయదారులకు రెండవ పంట లాభిస్తుంది. గురుని అష్టమ స్థితి, రాహువు అర్థాష్టమ స్థితి వల్ల మానసిక ఆందోళన. చికాకులు. ఇతరులతో మాటపడాల్సిన పరిస్థితి ఉంటుంది. కనకధారా స్తోత్రాలు పఠిస్తే మంచిది.

## ధనుస్సు...

**ఆదాయం-5, వ్యయం-5, రాజపూజ్యం-1, అవమానం-5.**

కొన్ని సమస్యలు, ఇబ్బందులు ఎదురైనా అత్యంత చాకచక్యంతో పాటు దైవకృపతో అధిగమిస్తారు. మనోబలమే ఆయుధంగా భావించాలి.పట్టుదల, దీక్షగా ముందుకు సాగితే మంచి ఫలితాలు సాధిస్తారు. వీరికి అర్థాష్టమ శనితో పాటు, మే 14వరకు, తిరిగి అక్టోబర్-నవంబర్ మధ్య అష్టమ గురుడు దోషకారులు. రాహు,కేతువులు శుభ ఫలితాలు ఇస్తారు. శని, అష్టమ గురుడు ఆరోగ్యంపై ప్రభావం చూపుతారు. ఆయా కాలాల్లో కొంత జాగ్రత్తలు పాటించడం మంచిది. అలాగే, నేత్ర, ఉదర, హృదయ సంబంధిత రుగ్మతలు బాధించవచ్చు. పేరుప్రతిష్ఠలకు కూడా భంగం కలుగుతుంది. ఎవరినీ అతిగా విశ్వసించకుండా దైవంపై భారం మోపి ముందుకు సాగడం మంచిది. ప్రయాణాల్లోనూ విలువైన వస్తువులు చేజారే వీలుంది. కుటుంబంలో సమస్యలు పెరిగి సవాలుగా నిలుస్తాయి. కొన్ని వ్యవహారాలలో పట్టువిడుపు ధోరణి మంచిది. ఇక డిసెంబర్ నుండి గురుడు శుభఫలితాలు ఇస్తాడు. ఆదాయం పెరిగి అవసరాలకు లోటు రాదు. అలాగే, మానసిక ప్రశాంతత, ఒడిదుడుకుల నుండి విముక్తి లభిస్తుంది. ఉద్యోగయత్నాలు కలసివస్తాయి.

వాణిజ్య, వ్యాపారాలలో లాభనష్టాలను సమానంగా స్వీకరించాల్సి వస్తుంది. అయితే భాగస్వాముల చేయూతతో సమస్యలు తీరతాయి. ఉద్యోగస్తులకు పనిభారం మరింతగా పెరిగినా కొంత కీర్తి కూడా దక్కుతుంది. అయితే సంవత్సరాంతంలో పదోన్నతులు దక్కవచ్చు. పారిశ్రామికవర్గాలకు చేసే యత్నాలు ముందుకుసాగని పరిస్థితి. అధికారుల నుండి సమస్యలు రావచ్చు. రాజకీయవర్గాలకు గందరగోళ పరిస్థితి నెలకొన్నా గౌరవానికి లోటు రాదు. కళాకారులు అనుకున్న అవకాశాలు సాధించేందుకు శ్రమపడాలి. విద్యార్థులకు ఒత్తిడులు పెరుగుతాయి. వ్యవసాయదారులకు ద్వితీయార్థంలో అనుకూలస్థితి. శని, గురులకు తగిన పరిహారాలు చేసుకుంటూ ఉండాలి. రుద్రాభిషేకాలు చేయించుకుంటే మంచిది.

## మకరం..

**ఆదాయం-8 వ్యయం-14, రాజపూజ్యం-4, అవమానం-5**

వీరికి మే 14 వరకు, తిరిగి అక్టోబర్-నవంబర్ మధ్య గురుడు యోగకారకుడు, మిగతా కాలమంతా దోషకారి. శని సంవత్సరమంతా శుభఫలితాలు ఇస్తాడు. ఇక రాహు, కేతువుల సంచారం మిశ్రమంగా ఉంటుంది.

ఆర్థికంగా కొంత ఇబ్బందులు పడతారు. ఖర్చులు అధికమై అప్పుల కోసం యత్నిస్తారు. అయితే సమాజంలోనూ, కుటుంబంలోనూ మీ మాటే చెల్లుబాటు కాగలదు. మీకు దూరంగా ఉన్న వ్యక్తులు దగ్గరకు చేరడం సంతోషాన్నిస్తుంది. స్థిరాస్తి వివాదాలు పరిష్కారానికి చేరువుగా ఉంటాయి. ఆపదలో ఉన్నవారికి చేతనైన సహాయం అందించేందుకు ముందుంటారు. ఇళ్ల నిర్మాణాలపై దృష్టి సారించి పూర్తి చేస్తారు. కొత్త ఉద్యోగ ప్రయత్నాలలో సఫలమవుతారు. జీవితభాగస్వామితో మరింత సఖ్యత నెలకొంటుంది. బంధుమిత్రులతో మీ అభిప్రాయాలను పంచుకుంటారు. కొన్ని సేవాకార్యక్రమాలు చేపడతారు. తరచూ ప్రయాణాలు సంభవం. విదేశీ ప్రయాణాలు కూడా ఉండవచ్చు. శుభకార్యాల నిర్వహణకు సమాయత్తమవుతారు. ఆర్థికంగా కొంత ఒడిదుడుకులు ఎదురైనా ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తారు. ఆరోగ్యం కూడా తరచూ ఇబ్బంది కలిగిస్తుంది. వైద్యసేవలు అవసరం కావచ్చు. రాహు, కేతువులు, మే-అక్టోబర్, డిసెంబర్ తరువాత గురుని ప్రభావంతో కొన్ని హఠాత్తు పరిణామాలు, సంఘటనలు ఎదురుకాగలవు. నరాలు, చర్మ సంబంధిత రుగ్మతలు కలిగే అవకాశం.మొత్తానికి వీరు మనోనిబ్బరంతో గడపడం ఉత్తమం.

ఇక వాణిజ్య, వ్యాపారాలలో సమన్వయం పాటించాలి. లాభాలు దక్కినా వాటిని నిలబెట్టుకోవాలి. ఉద్యోగస్తులు విధుల పట్ల అంకితభావం చూపుతారు. సరైన గుర్తింపు ఇంతకాలానికి దక్కుతుంది. పారిశ్రామిక వర్గాలకు ఊహించని విధంగా అనుమతుల దక్కి అగ్రిమెంట్లు కుదురుతాయి. రాజకీయవేత్తలకు నవంబర్ నెల అత్యంత శుభదాయకంగా ఉంటుంది. కళాకారులు స్వయంగా నిర్ణయాలు తీసుకుని అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి. శాస్త్ర, సాంకేతిక రంగాల వారికి మునుపటి కంటే మెరుగ్గా ఉంటుంది. విద్యార్థులకు ఆశించిన విధంగా ఫలితాలు రావచ్చు. వ్యవసాయదారుల కృషి, యత్నాలు ఫలిస్తాయి.

గురు, రాహు, కేతువులకు పరిహారాలు చేయడం, దుర్గాదేవిని ఆరాధించడం మంచిది.

## కుంభం...

**ఆదాయం-8, వ్యయం-14, రాజపూజ్యం-7, అవమానం-5**

ఏల్నాటి శని చివరి భాగానికి చేరుకుంది. అయితే శని సువర్ణమూర్తి కావడం శుభకరం. గురు సంచారం కూడా శుభదాయకమే. ఇక జన్మరాశిలో రాహువు, సప్తమంలో కేతువు సంచారం ప్రతికూల అంశాలు. మొత్తానికి వీరికి శని, గురులు మంచి ఫలితాలు ఇస్తారు. ధనానికి లోటు రాకుండా గడి చిపోతుంది. ఎవరిపైనా ఆధారపడకుండా వ్యవహారాలు చక్కదిద్దుకుంటారు. ఒక సమాచారం మీకు ఎంతో ఉపయోగపడుతుంది. ఇంట శుభకార్యాల హడావిడి పెరుగుతుంది. బంధువులతో సత్సంబంధాలు నెలకొంటాయి. భార్యాభర్తల మధ్య నెలకొన్న అపోహలు తొలగుతాయి. వాహనాలు, ఖరీదైన ఇళ్లు కొనుగోలు చేస్తారు. నిరుద్యోగుల చిరకాల కోరిక నెరవేరే కాలం.

సమాజంలో పేరుప్రతిష్ఠలు పెరుగుతాయి. అనుకున్నది సాధించాలన్న లక్ష్యంతో పనిచేస్తారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటారు. కోర్టు వ్యవహారం కొలిక్కి వచ్చే అవకాశముంది. అక్టోబర్-నవంబర్ మధ్యకాలంలో ఆరోగ్యం ముఖ్యంగా నరాలు, జ్వర సంబంధిత రుగ్మతలు బాధిస్తాయి. వాణిజ్య,వ్యాపారాలు క్రమేపీ పుంజుకుని లాభాలు ఊరటనిస్తాయి. కొత్త వ్యాపారాలు కూడా ప్రారంభిస్తారు. ఉద్యోగులకు పదోన్నతులతో కూడిన బదిలీలు ఉంటాయి. పనిభారం నుండి ఉపశమనం. పారిశ్రామికవర్గాలకు ఉత్సాహవంతంగా గడుస్తుంది. రాజకీయవర్గాలకు కొత్త పదవులు దక్కే సూచనలు. వీరి మాటకు తిరుగు ఉండదు. కళాకారుల కలలు ఫలిస్తాయి. మంచి గుర్తింపు లభిస్తుంది. విద్యార్థులకు రెండుమూడు అవకాశాలు దక్కవచ్చు. వ్యవసాయదారులకు రెండవ పంట లాభసాటిగా ఉంటుంది. శనికి తైలాభిషేకాలు, దుర్గాదేవికి కుంకుమార్చనలు చేయడం ఉత్తమం.

## మీనం...

**ఆదాయం-5, వ్యయం-5 రాజపూజ్యం-3, అవమానం-1**

జన్మరాశిలో శని సువర్ణమూర్తి కావడం, రాహువు, కేతువులు కూడా సువర్ణమూర్తులుగా సంచారం, మే 14 తరువాత గురుని ప్రభావంతో కొంత అనుకూల ఫలితాలు. ఆదాయానికి ఎటువంటి ఇబ్బంది లేకుండానే సర్దుబాటు కాగలదు. అప్పులు చేసినా వెనువెంటనే తీరుస్తారు. ఇష్టమైన వ్యక్తులు మరింత దగ్గరవుతారు. తీర్థయాత్రలు విరివిగా చేసి ఆధ్యాత్మికతను పెంచుకుంటారు. సంవత్సర ప్రారంభంలో కొన్ని సమస్యలు, కార్యక్రమాలలో అవాంతరాలు ఎదురైనా మనోబలంతో అధిగమిస్తారు. అలాగే, ఆరోగ్యం కొంత సహకరించక ఇబ్బంది పడతారు. అయితే త్వరగానే స్వస్థత చేకూరుతుంది. చేసే పనిపై ఏకాగ్రత కలిగి సమయానికి పూర్తి చేస్తారు. ఆలోచనలు వెంటనే అమలు చేస్తారు. బలమైన ప్రత్యర్థులు కూడా మీ మంచితనానికి విధేయులై మసలుకుంటారు. కుటుంబంలో వివాహాది శుభకార్యాలు నిర్వహిస్తారు. ఉద్యోగార్థులు తమ ప్రయత్నాలలో సఫలం చెందుతారు. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. అలాగే, ఇంటి నిర్మాణం లేదా కొనుగోలుకు సన్నద్ధమవుతారు. కాంట్రాక్టర్లు, రియల్ఎస్టేట్ వ్యాపారులు ద్వితీయార్థంలో మరింత లబ్ధి పొందుతారు. వాణిజ్య, వ్యాపారవేత్తలు పెట్టుబడులు అంది ముందడుగు వేస్తారు. సంస్థలను మరింత విస్తరించే దిశగా అడుగులు వేస్తారు. ఉద్యోగులకు ఒత్తిడులు పెరిగినా అధిగమిస్తారు. పైస్థాయి నుంచి ప్రోత్సాహం ఉంటుంది. రాజకీయవర్గాలకు ప్రజాదరణ పెరుగుతుంది. పారిశ్రామికవర్గాలకు తరచూ విదేశీ పర్యటనలతో గడుపుతారు. కళాకారులకు అవకాశాలతో పాటు విజయాలు వరిస్తాయి. విద్యార్థులకు శ్రమానంతరం మంచి ఫలితాలు రాగలవు. వ్యవసాయదారులు రెండవ పంటలో లాభాలు పొందుతారు. శని, రాహు, ప్రథమార్థంలో గురునికి పరిహారాలు చేయాలి. అలాగే, నృసింహస్తోత్రాలు పఠనం ఉత్తమం.

**సర్వేజనా సుఖినోభవంతు...**

**సింహంభట్ల సుబ్బారావు**

# హిందూ నూతన సంవత్సర పర్వదినం - ఉ(యు)గాది

(30 మార్చి "విశ్వావసు ఉగాది పర్వదినం" సందర్భంగా)



ఉగాది లేదా యుగాది అనబడే "చంద్ర - సౌర క్యాలండర్" లేదా "పంచాంగం" ప్రకారం దక్షిణ భారత తెలుగు రాష్ట్రాలు, కర్నాటక ప్రజలు ఘనంగా నిర్వహించుకునే నూతన సంవత్సర తొలి రోజు వేడుక. యుగ అనగా యుగం అని, ఆది అనగా ప్రారంభ లేదా తొలి రోజు అని అర్థం. యుగాది అనగా యుగానికి మొదటి రోజు అని అర్థం చేసుకోవాలి. పంచాంగ వివరాల ప్రకారం 60 సంవత్సరాల క్యాలెండర్ లేదా "సాకా సంవత్" ప్రకారం, గ్రెగోరియన్ క్యాలెండర్ తేదీ 30 మార్చి 2025న విశ్వావసు నూతన సంవత్సరం ప్రారంభం అవుతున్న శుభ గడియల్లో చైత్ర మాస వేళ ఉగాది పర్వదినాన్ని జరుపుకోవడం అనాదిగా వస్తున్నది.

**ఉగాది పర్వదినాన పరమార్థం:**

ప్రతి ఏట మార్చి లేదా ఏప్రిల్ నెలల్లో ఈ పండుగ వస్తుంది. 12వ శతాబ్దపు గణితశాస్త్రవేత్త భాస్కరాచార్య ప్రారంభించిన ఉగాది పండుగను కృష్ణావతార సమాప్తి తర్వాత నిర్వహించడం విశేషం. పురాణాల ప్రకారం రాముడు వన వాసం పూర్తి చేసి అయోధ్యకు వచ్చిన శుభ గడియలను ఉగాదిగా భావిస్తారు. విశ్వాన్ని బ్రహ్మ సృష్టించిన తొలి రోజుగా కూడా ఉగాదిని పరిగణిస్తారు.

**భారతంలో పలు పేర్లతో యుగాది:**

ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లో ఉగాది పండుగ జరుపుకుంటూ ఉండగా మహారాష్ట్రలో 'గుడి పడ్వా', తమిళనాడులో 'పతండు', అస్సాంలో 'బిహూ', పంజాబ్‌లో 'బైసాఖీ', రాజస్థాన్‌లో 'తపన', మణిపూర్‌లో 'సాహిబ్ నోంగ్మా పంబ', పశ్చిమ బెంగాల్లో 'నబ వర్షా', సింధు సమాజంలో 'చెట్టీ ఛాంద్?' పేర్లతో ఉగాదిని జరుపుకోవడం మన భారతీయ సాంప్రదాయం. ఆధ్యాత్మిక, సాంస్కృతిక, వ్యవసాయ సీజన్ ప్రత్యేకతగా ఉగాది పర్వదినం జరుపుకుంటున్నాం. ఆనందం, సంపదలు, సమన్వయ సమాజ వేడుకగా ఉగాదికి గుర్తింపు ఉన్నది.

**షడ్రుచుల ఉగాది పచ్చడి పరమార్థం:**

ఉగాదితో మొదలై నవరాత్రుల పాటు దుర్గా మాతను పూజించే సంస్కృతి కూడా ఉన్నది. ఈ పర్వదినం రోజున తైల మర్ధనంతో స్నానాలు చేసి, తీపి చేదుల కలయికగా షడ్రుచుల ఉగాది పచ్చడి (వేప పువ్వు, మామిడి ముక్కలు, చింతపండు, బెల్లం లేదా చక్కెర, కారం లేదా పచ్చి మిరపకాయ, ఉప్పు)ని తీర్థ ప్రసాదాల వలె తీసుకొని జీవితంలో కష్టసుఖాలను పంచుకునే ధైర్యాన్ని పోగుచేసుకొని, మందిరాల్లో పూజలు చేసుకొని, ఊరు వాడ సంబరాలు చేసుకొని, భక్షాలు లేదా బొబ్బట్లు లాంటి రుచికరమైన పిండి వంటలతో సరదాగా, భక్తి భావనలతో పంచాంగ శ్రవణాలకు హాజరై తమ రాశీ పలాలను తెలుసుకోవడం ఆచారంగా వస్తున్నది. ఆరు రుచుల ఉగాది పచ్చడి జీవిత పరమార్థాన్ని వివరిస్తుంది. కష్టాల్లో కుంగడం, సుఖాల్లో పొంగడం సరియైన జీవన విధానం కాదని ఉగాది పర్వదినం బోధిస్తున్నది. ఆశావహ దృక్పథ సుగుణం, పరస్పర సహకార భావన, ఐక్యత, వివేకవంతమైన జీవనశైలిని అలవాటు చేసుకొని పౌర సమాజం శాంతి సౌభాగ్యాలతో ముందుకు సాగాలని కోరుకుందాం. విశ్వావసు సంవత్సర ఉగాది శుభాకాంక్షలను తెలియజేద్దాం.

# సెంట్రల్ కాంట్రాక్ట్‌లోకి కొత్త పేరు?

## బీసీసీఐ మీటింగ్ వాయిదా



**గువాహటి:** కీలకమైన బీసీసీఐ మీటింగ్ వాయిదా పడినట్లు సమాచారం. గువాహటిలో ఈ సమావేశం జరగాల్సి ఉంది. అయితే, ఎందుకు వాయిదా పడిందో కారణం మాత్రం తెలియడం లేదు. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌తో బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా, ఇతర అధికారులు సమావేశం కావాల్సి ఉంది. సెంట్రల్ కాంట్రాక్ట్‌లు, ఇంగ్లాండ్ పర్యటన సన్నద్ధతపై చర్చించాల్సి ఉంది. ఇప్పుడు కొత్త తేదీకి మీటింగ్‌ను మార్చినట్లు కథనాలు వస్తున్నాయి. అయితే, ఎప్పుడనేది ఇంకా తెలియరాలేదు. ప్రధాన కోచ్ గంభీర్ కుటుంబంతో కలిసి విదేశాలకు వెళ్లిన సంగతి తెలిసిందే. అతడు అందుబాటులో లేకపోవడమూ సమావేశం వాయిదాకు కారణమై ఉండొచ్చని తెలుస్తోంది.

**వారితో చర్చించాకనే..**

ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, అజిత్ అగార్కర్‌తో బీసీసీఐ ప్రధానంగా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టెస్టు భవిష్యత్తుపై చర్చించనుంది. సుదీర్ఘ ఫార్మాట్‌లో కొనసాగించడంపైనా.. భారత టెస్టు జట్టుకు కొత్తగా ఎవరిని సారథిగా నియమించాలి? అలాగే సెంట్రల్ కాంట్రాక్ట్‌ల్లో ఏ ప్లస్ జాబితాలోని రోహిత్, విరాట్, బుమ్రా, జడేజాను కొనసాగిస్తారా? లేదా? అనేది కీలక పాయింట్. టీ20 ప్రపంచ కప్ ముగిసిన తర్వాత రో-కో రాకుండా జడేజా కూడా పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. అన్నింట్లోనూ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించే వారికే ఏ ప్లస్ ఇవ్వాలనేది కొందరి వాదన. అయితే, ఇప్పటికైతే వీరి సెంట్రల్ కాంట్రాక్ట్‌లో ఎలాంటి మార్పు ఉండకపోవచ్చనేది పలువురి అభిప్రాయం. ఇక ఇంగ్లాండ్‌తో జూన్‌లో టెస్టు సిరీస్‌ను ఆడనుంది. జట్టు ఎంపికతోపాటు సన్నద్ధతపై తీసుకోవాల్సిన చర్యల గురించి కూడా ఇందులో చర్చ జరగనుంది.

**వరుణ్‌కు అవకాశం..**

ఛాంపియన్స్ ట్రోఫీలో అదరగొట్టిన వరుణ్ చక్రవర్తి కి బంపర్ ఆఫర్ తగలనుంది. బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్‌లో చోటు దక్కే అవకాశం ఉంది. అతడితోపాటు గతంలో కాంట్రాక్ట్‌లను కోల్పోయిన శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్ పేర్లనూ చేర్చడం ఖాయంగానే కనిపిస్తోంది. అదే సమయంలో కాంట్రాక్ట్‌ల్లో పలువురికి పదోన్నతి లభించే ఛాన్స్ లేకపోలేదు.




# మీ ఆటతీరు అవుట్‌డేటెడ్ అయిందా?

## విలేఖరి ప్రశ్నకు ఫ్లెమింగ్ అసహనం

**చెన్నై:** తొలి సీజన్ (2008) తర్వాత చెన్నై సూపర్ కింగ్స్‌కు చెపాక్ వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చేతిలో ఓటమి ఎదురైంది. ఐపీఎల్ 2025 సీజన్‌లో తొలి పరాజయం. ఈ క్రమంలో సీఎస్కే కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్‌కు ఎదురైన ప్రశ్నకు కాస్త ఆగ్రహం తెప్పించింది. చెన్నై బ్రాండ్ క్రికెట్ పాతబడిందనే వాదనను ఫ్లెమింగ్ కొట్టిపడేశాడు.

**రిపోర్టర్ :** తొలి మ్యాచ్‌లో 156 పరుగుల టార్గెట్‌ను 20వ ఓవర్ వరకూ తీసుకెళ్లారు. ఇప్పుడు 146 పరుగులే చేయగలిగారు. ఇది మీరు క్రికెట్ ఆడే విధానమని తెలుసు. కానీ, ఇది అవుట్‌డేట్ (పాతబడటం) అయిందని అనిపించడం లేదా?

**ఫ్లెమింగ్:** మా క్రికెట్ ఆడే తీరుపై మీ ఉద్దేశం ఏంటి? మీరు ఫైర్‌పవర్ గురించి మాట్లాడారు. మన దగ్గర ఫైర్ పవర్ అంతా ఉంది. మీ ప్రశ్న ఏంటో అర్థం కావడం లేదు. ఎందుకంటే మేం తొలి బంతి నుంచే స్వింగ్ చేయలేదు. అలాగే అదృష్టం కూడా కలిసి రావాలి. అయితే, చివరికి విజేతగా ఎవరు నిలుస్తారనేది చూడాలి. మాది పాజిటివ్ బ్రాండ్ ఆఫ్ క్రికెట్. మమ్మల్ని తక్కువగా అంచనా వేయకండి.

**రిపోర్టర్:** నేను మిమ్మల్ని తక్కువగా అంచనా వేయడం లేదు.

**ఫ్లెమింగ్:** మీరు అడిగింది సిల్లీగా అనిపిస్తోంది.



సొంత మైదానం అడ్వాంటేజ్‌పై..

"గత కొన్నేళ్లుగా నేను చెపాక్ స్టేడియం గురించి చెబుతూనే ఉన్నా. ఇక్కడ హోం అడ్వాంటేజ్ అనేదే ఉండదు. గతంలో ఇతర వేదికల్లో జరిగిన మ్యాచుల్లోనూ విజేతగా నిలిచాం. ప్రతి రోజూ ఇక్కడ మాకు కొత్త సవాలే. పిచ్‌ను అర్థం చేసుకొని సరైన జట్టును బరిలోకి దింపాల్సి ఉంది. కొన్నిసార్లు సరిగ్గా అంచనా వేయలేకపోవచ్చు" అని ఫ్లెమింగ్ వెల్లడించాడు.







VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123
Hyderabad (Sai Ganesh) : Cell : 9030841841, Parawada (satyanarayana): Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, For advertisements (Raghunath) : 7013785256, Arilova (D.Venkatesh) : 94937 77390.
Maddilapalem (G.Raamakrishna) : 99084 24231, Anakapalli (M.Krishna Rao) : 63023 75539, Chintapalli (Srinivas) : 94923 40861.
Bheemunipatnam (B.Appalareddy) : 98662 78981, Srikakulam (Ramarao) : 70321 98574, Pithaapuram (staalin) : 94912 23264,

గమనిక : ఇక్కడ ఇవ్వబడిన పేర్లు కలిగిన వారిని మాత్రమే విశాఖ సమాచారమ్ దినపత్రికకు విలేఖరులుగా గుర్తించవలెను. ఇక్కడ పేరు లేకుండా ఎవరైనా విశాఖ సమాచారమ్ ప్రతినిధిగా చెబితే నమ్మవద్దు.